TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి






EDITOR :VADLA MADHUSUDHAN CHARY | MEDCHAL /MALKAJGIRI | VOLUME:1 | ISSUE:66 | THURSDAY , JULY 16 ,2026 | PAGES:8 | COST: 4 /-



ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి | మేడ్చల్ /మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 66 | గురువారం 16 జూలై 2026 | పేజీలు :8 | వెల: 4/-


# హుస్సేన్ సాగర్ సమీపంలో భారీ ప్రాజెక్టు..



## ప్రదీప్ కన్స్ట్రక్షన్స్‌కు హైకోర్టులో ఊరట

- ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తెలంగాణ హైకోర్టులో అనుకూల తీర్పు
- చట్టపరమైన వివాదాలతో ఆలస్యమైన పనులు వేగవంతమయ్యే అవకాశం

హంసకలం వార్త :తెలంగాణలోని మౌలిక సదుపాయాల రంగంలో కీలకమైన ఓ ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమైన పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్ హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోని నిర్మాణాలకు సంబంధించి ప్రదీప్ కన్స్ట్రక్షన్స్ సంస్థకు 2లో

# తెలంగాణలో 'సర్' గడువు పొడిగింపు

హంసకలం వార్త : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) పొడిగించింది. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం బుధవారం సవరించింది. దీంతో ఇంటింటి సర్వేకు ఆగస్టు 3 వరకు గడువు పొడిగించినట్లు అయింది. ఆగస్టు 10న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేయనుంది. మిగతా2లో







# ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి అమెజాన్ డేటా సెంటర్ మైలురాయి

2

- ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు రేవంత్ శంకుస్థాపన
- 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న సీఎం
- ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్-500 కంపెనీలకు ఆహ్వానం
- మెట్రో విస్తరణ, ఈవీ బస్సులు, మూసీ ప్రక్షాళనకు ప్రాధాన్యం

### పాలమూరు -- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి

# తొందర్లోనే శుభవార్త

- 90 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతులు సాధిస్తామని వెల్లడి
- మహబూబ్‌నగర్‌లో అమర రాజా తయారీ యూనిట్‌ను ప్రారంభించిన రేవంత్
- పరిశ్రమల్లో స్థానికులకే అత్యధిక ఉద్యోగాలు ఇవ్వాలని సూచన
- పాలమూరును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామని హామీ



హంసకలం వార్త : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి త్వరలోనే శుభవార్త వింటారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో 'అమర రాజా గ్రూప్'నెలకొల్పిన మిగతా2లో





## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

- షాబాద్ ఘటనపై రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ లేఖ
- పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి
- పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన వైనం
- పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని పవన్ ఆరోపణ
- బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ

### అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌కు

# కేబినెట్ ర్యాంక్

- ప్రభుత్వ విప్‌లుగా ఉన్న ఇద్దరు ఎమ్మెల్సీలకు మంత్రి హోదా
- మంత్రి హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఎమ్మెల్సీ పదవీకాలం మొత్తం ఈ హోదా వర్తింపు



హంసకలం వార్త : తెలంగాణలోని ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్సీలకు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ప్రస్తుతం ప్రభుత్వ విప్‌లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న అద్దంకి దయాకర్, డాక్టర్ బల్మూరి వెంకట్ నర్సింగరావులకు ఈ హోదాను కల్పిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరికి నిబంధనల ప్రకారం ప్రోటోకాల్ సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. పార్టీకి వారు చేసిన సేవలను గుర్తించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. అద్దంకి దయాకర్ తెలంగాణ మిగతా2లో

### 50 నామినేటెడ్ పదవులు

# ఈ నెలలోనే భర్తీ




- మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేస్తామన్న మహేశ్ గౌడ్
- పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్ తో చర్చించామని వెల్లడి
- మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టీకరణ

హంసకలం వార్త :రాష్ట్రంలో 50 నామినేటెడ్ పదవులను ఈ నెలలోనే భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ప్రస్తుతం మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకా శం ఉందని వెల్లడించా రు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెం డు రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అవుతామన్నారు. మండల మిగతా2లో



## డ్రగ్స్‌ను అరికట్టేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక నిఘా.. డీజీపీ ఆదేశాలు

హంసకలం వార్త : విద్యాసంస్థల్లో డ్రగ్స్‌పై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని ఈగల్ విభాగంలోని అధికారులకు తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. డ్రగ్స్ నిరోధించడంపై బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఈగల్ అధికారులతో సి.వి. ఆనంద్ ఉన్నతస్థాయి సమీక్ష 2లో

# ఢిల్లీకి బయల్దేరిన కేటీఆర్.. కుమారస్వామితో కీలక భేటీ



- ఆదిలాబాద్ జిల్లాలోని సిమెంట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని
- కుమారస్వామిని కోరనున్న కేటీఆర్
- భేటీ అనంతరం మీడియాతో మాట్లాడనున్న కేటీఆర్
- కేటీఆర్‌తో పాటు ఢిల్లీకి వెళ్లిన వద్దిరాజు రవిచంద్ర, జోగు రామన్న

హంసకలం వార్త : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని బృందం ఢిల్లీకి బయలుదేరింది. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని ఈ బృందం కలిసి ఆదిలాబాద్ జిల్లాలోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కోరనుంది. ఈ మేరకు కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేయనున్నారు. బృందంలో కేటీఆర్‌తో పాటు రాజ్యసభ సభ్యులు -మిగతా2లో



### మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో

# మంత్రి సీతక్క కీలక సమీక్ష

హంసకలం వార్త : మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క బుధవారం సచివాలయంలో కీలక సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఈసందర్భంగా మిగతా2లో

## పాలమూరు -- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి తొందర్లోనే శుభవార్త

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి త్వరలోనే శుభవార్త వింటారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో 'అమర రాజా గ్రూప్' నెలకొల్పిన తయారీ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 90 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా కేంద్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఒప్పించి, అవసరమైన అనుమతులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని ప్రకటించారు. అదేవిధంగా, డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపులపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. కృష్ణా బేసిన్ పరిధిలోని దిండి, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యతను తాను స్వీకరిస్తానని సీఎం హామీ ఇచ్చారు. అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నిలిపి, ఒక ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపన కోసం భూములిచ్చిన రైతులకు తగిన న్యాయం జరగాలని, అలాగే స్థానిక యువతకే గరిష్ట స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలని యాజమాన్యానికి సూచించారు. అంతకుముందు, అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన 'కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్' తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పర్యావరణ మార్పుల నేపథ్యంలో కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని, ఈ తరుణంలో బ్యాటరీల తయారీ యూనిట్‌ను ఇక్కడ స్థాపించడం ముదావాహమని పేర్కొన్నారు. స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి కల్పిస్తున్న అమర రాజా సంస్థ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికను రూపొందించామని, పారిశ్రామిక విధానాల్లో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చామని సీఎం వివరించారు. అంతర్జాతీయ సంస్థలతో పోటీ పడుతూ అమరరాజా గ్రూప్ దేశానికి గర్వకారణంగా నిలుస్తోందని ఆయన ప్రశంసించారు.

## ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి అమెజాన్ డేటా సెంటర్ మైలురాయి

ఫ్యూచర్ సిటీని ప్రపంచంలోనే అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, దీనివల్ల మరిన్ని పెట్టుబడులు, అంతర్జాతీయ పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్-500 కంపెనీలను ఆహ్వానిస్తున్నామని రేవంత్ తెలిపారు. గతేడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌కు 108 దేశాల నుంచి పరిశ్రమలు పాల్గొన్నాయని గుర్తు చేశారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమన్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దతామని పేర్కొన్నారు. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో తెలంగాణ వాటా 10 శాతం ఉండేలా కృషి చేస్తామని అన్నారు. ఈ లక్ష్యాల సాధనకు భారీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు అవసరమని, అందుకే 'తెలంగాణ రైజింగ్' విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం మంత్రులు, అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు నగరంలోని పరిశ్రమలను దశలవారీగా తరలిస్తామని, మెట్రో విస్తరణ చేపడతామని సీఎం వెల్లడించారు. డీజిల్‌తో నడిచే ఆర్టీసీ బస్సులను నగరం వెలుపలికి తరలించి, వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి జీరో ట్యాక్స్ విధించే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి కాలుష్య రహితంగా మారుస్తామని, మెట్రో విస్తరణ, మూసీ పునరుద్ధరణ, పరిశ్రమల తరలింపుతో కూడిన ప్రాంతాన్ని 'కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)'గా అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈ ప్రాంతాన్ని భవిష్యత్తులో సేవల రంగానికి అనుగుణంగా పునర్నిర్మిస్తామని చెప్పారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు 10 కిలోమీటర్ల పరిధిని తయారీ పరిశ్రమల (మ్యాన్యుఫ్యాక్చరింగ్) జోన్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములు ఇచ్చిన రైతుల సేవలను ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని రేవంత్ అన్నారు. వారికి ఎలాంటి నష్టం జరగకుండా తగిన పరిహారం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

## డ్రగ్స్‌ను అరికట్టేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక నిఘా.. డీజీపీ ఆదేశాలు

విద్యాసంస్థల్లో డ్రగ్స్‌పై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని ఈగల్ విభాగంలోని అధికారులకు తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. డ్రగ్స్ నిరోధించడంపై బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఈగల్ అధికారులతో సి.వి. ఆనంద్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో 'యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీలు' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి విద్యాసంస్థలో క్యాంపస్ సేఫ్టీ కో ఆర్డినేటర్ నియామకం తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని.. అవసరమైతే గుర్తింపును రద్దు చేసేందుకు సిఫార్సు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతతోపాటు డ్రగ్స్ నివారణ చర్యలపై సేఫ్టీ కమిటీలు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీసు, విద్య, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశించారు. విద్యార్థులకు సైకాలజిస్టులు, కౌన్సెలర్ల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. అలాగే తల్లిదండ్రుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. పోలీసు, విద్య, ఆరోగ్య శాఖల సమన్వయంతో డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యమన్న తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. డ్రగ్స్ రహిత విద్యాసంస్థల కోసం త్వరలోనే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ) విడుదల చేయనున్నారు. ప్రభుత్వానికి తుది ప్రతిపాదనలు సమర్పించే ముందు మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఐజీ పద్మజా రెడ్డి, ఎస్పీ గిరిధర్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క కీలక సమీక్ష

మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క బుధవారం సచివాలయంలో కీలక సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు, పప్పు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. టేక్ హోమ్ రేషన్ పంపిణీలో వేగం పెంచాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, 3 నుంచి 6 ఏళ్ల చిన్నారుల హాజరును పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. పలు పథకాల కింద బడ్జెట్ విడుదల, వ్యయంపై జిల్లాల వారీగా పనితీరును పరిశీలించారు. అంగన్వాడీ 'తొలిముద్ద' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

# మళ్లీ పుంజుకోనున్న రుతుపవనాలు

గత కొన్ని రోజులుగా దేశంలో అనేక ప్రాంతాల్లో వానలు తగ్గి ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని కబురు చెప్పింది. మందగించిన నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా మళ్లీ పుంజుకోనున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఒక బలమైన వాతావరణ వ్యవస్థ (అల్పపీడన ద్రోణి) కారణంగా ఈ రుతుపవనాలు తిరిగి చురుగ్గా మారేందుకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

### బంగాళాఖాతంలో కదలికలు.. వర్షాల పునరాగమనం

ఈ తాజా అల్పపీడన ప్రభావంతో జులై మూడో వారంలో దేశవ్యాప్తంగా వర్షాలు మళ్లీ ఊపందుకోనున్నాయి. ప్రధానంగా మధ్య భారతదేశం, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాలు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా), తూర్పు రాష్ట్రాలలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేస్తోంది. వ్యవసాయ పనులకు ఈ వర్షాల పునరాగమనం ఎంతో కీలకం కానుంది. వర్షాలు లేక ఆందోళన చెందుతున్న రైతులకు ఈ వార్త పెద్ద ఊరటనిస్తోంది. ఈ అల్పపీడన వ్యవస్థ పశ్చిమ-వాయవ్య దిశగా కదిలే కొద్దీ దేశంలోని అంతర్గత ప్రాంతాలలో మేఘాలు దట్టంగా అలముకుని, రాబోయే వారం రోజుల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. రాబోయే 48 గంటల్లో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు. పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో దర్యాప్తులో నిర్దిష్ట కాలపరిమితిని పాటించాలని, సాక్ష్యాధారాలు తారుమారుకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సదరు కేసులో నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం, అదే సమయంలో బాధితుల కుటుంబానికి తగిన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమవడంపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పోక్సో కేసులకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

## తెలంగాణలో 'సర్' గడువు పొడిగింపు

ఆగస్టు 10న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేయనుంది. సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనుంది. అక్టోబర్ 8వ తేదీ వరకు అభ్యంతరాలను పరిష్కారించనుంది. అక్టోబర్ 12న తుది ఓటరు జాబితాను ప్రచురించనుంది. సర్ గడువును పొడిగించాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. దీంతో సర్ షెడ్యూల్‌ను సీఈసీ సవరించింది. దీనిని అధికారులతోపాటు రాజకీయ పార్టీలకు తెలియజేయాలని జారీ చేసిన ఆదేశాల్లో సీఈసీ స్పష్టం చేసింది.

## హుస్సేన్ సాగర్ సమీపంలో భారీ ప్రాజెక్టు..

తెలంగాణలోని మౌలిక సదుపాయాల రంగంలో కీలకమైన ఓ ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమైన పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్ హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోని నిర్మాణాలకు సంబంధించి ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సదరు నిర్మాణ సంస్థపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశించింది. సోమాజిగూడ నెక్లెస్ రోడ్డు సమీపంలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ ఒక భారీ బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని చేపట్టింది. అయితే, ఈ నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందంటూ జీహెచ్‌ఎంసీ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ సదరు సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, తదుపరి ఆదేశాలు వెలువడే వరకు సదరు నిర్మాణ ప్రాజెక్టు విషయంలో యథాతథస్థితిని కొనసాగించాలని స్పష్టం చేసింది. భవన నిర్మాణంపై ఎటువంటి బలవంతపు చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. అలాగే, ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని జీహెచ్‌ఎంసీ తరఫు న్యాయవాదికి ధర్మాసనం సూచించింది. జీహెచ్‌ఎంసీ చట్టం సెక్షన్ 450 కింద ప్రాజెక్టుకు మంజూరు చేసిన భవన నిర్మాణ అనుమతులను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ జూలై 7న జీహెచ్‌ఎంసీ షోకాజ్ నోటీసు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ హైకోర్టును ఆశ్రయించగా, విచారణ చేపట్టిన ధర్మాసనం సదరు సంస్థకు అనుకూలంగా తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది.

## 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ

రాష్ట్రంలో 50 నామినేటెడ్ పదవులను ఈ నెలలోనే భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ప్రస్తుతం మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అవుతామన్నారు. మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరితో కూడా మాట్లాడానని మహేశ్ తెలిపారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టుగా రేణుక తనతో చెప్పారని అన్నారు. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు అని తెలిపారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికీ గాంధీభవన్ కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు.

## అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌కు కేబినెట్ ర్యాంక్

తెలంగాణలోని ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్సీలకు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ప్రస్తుతం ప్రభుత్వ విప్‌లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న అద్దంకి దయాకర్, డాక్టర్ బల్మూరి వెంకట్ నర్సింగరావులకు ఈ హోదాను కల్పిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరికి నిబంధనల ప్రకారం ప్రోటోకాల్ సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. పార్టీకి వారు చేసిన సేవలను గుర్తించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. అద్దంకి దయాకర్ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించడమే కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. ఇక విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చిన బల్మూరి వెంకట్, గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన పలు పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ ఆయన పలుమార్లు జైలుకు కూడా వెళ్లారు. కాగా, ఈ నియామకాలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) ఏప్రిల్ నెలలోనే అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పేరుతో సిద్ధమైనప్పటికీ, ప్రభుత్వం దీనిని తాజాగా విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, వారి ఎమ్మెల్సీ పదవీకాలం ముగిసేంత వరకు ఈ మంత్రి హోదా వర్తిస్తుంది.

## ఢిల్లీకి బయల్దేరిన కేటీఆర్..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని బృందం ఢిల్లీకి బయలుదేరింది. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని ఈ బృందం కలిసి ఆదిలాబాద్ జిల్లాలోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కోరనుంది. ఈ మేరకు కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేయనున్నారు. బృందంలో కేటీఆర్‌తో పాటు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి జోగు రామన్న, ఖానాపూర్ ఇంచార్జి జాన్సన్ నాయక్, సీసీఐ సాధన సమితి నాయకులు ఉన్నారు. కుమారస్వామితో భేటీ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడనున్నారు. తెలంగాణలో పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలని బీఆర్ఎస్ నేతలు కోరుతున్నారు. ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని బీఆర్ఎస్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. కేటీఆర్ ఢిల్లీ పర్యటన రాష్ట్ర అభివృద్ధి, పరిశ్రమల పునరుద్ధరణకు కీలకమవుతుందని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారు.

# సంపాదకీయం


## ఆధునిక అరబ్ నిర్మాణ దక్షుడు

దేశ ప్రతిష్ఠను పెంపొందించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి నిర్మాణాత్మక చర్యలతో ముందుకు వెళ్లడమే మానవీయ రాజధర్మమని నిరూపించిన అతి అరుదైన పాలకులలో, ఈ నెల 12న 74 ఏళ్ల వయసులో మరణించిన ఖతర్ మాజీ రాజు షేక్ హామద్ తానీ ఒకరు. అతి చిన్న ఎడారి రాజ్యమైన ఖతర్‌ను అగ్రగామి ఆధునిక దేశంగా రూపొందించేందుకు సంకల్పించి, ఆ సమున్నత లక్ష్యాన్ని అనతి కాలంలో సాధించిన రాజ్య నిర్మాణ దక్షుడు హామద్ తానీ. భారత్ తన జాతీయ పతాకాన్ని సగం వరకు అవనతం చేసి ఆయన మృతికి సంతాపాన్ని ప్రకటించింది. హామద్ అంత్యక్రియలలో సమస్త దేశాల అధికారిక ప్రతినిధి బృందాలు పాల్గొనడం అంతర్జాతీయ వ్యవహారాలలో ఖతర్ ప్రాధాన్యానికి తార్కాణం. జనాభాపరంగా తెలంగాణలోని ఉమ్మడి నల్లగొండ జిల్లా కంటే చిన్నదైన ఖతర్ ప్రపంచ పటంలో ప్రముఖంగా ఎదగడానికి హామద్ దూరదృష్టి, దీక్షా దక్షతలే ప్రధాన కారణం. ఖతర్ పాలనా బాధ్యతలు చేపట్టినది మొదలు అనేక విప్లవాత్మక నిర్ణయాలతో ఆ దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించారు. హామద్ అనుసరించిన విధానాలతో భారతీయులకూ ఖతర్‌లో పెద్ద సంఖ్యలో ఉపాధి లభించింది. ఇరుగు పొరుగు దేశాలు చమురు ఎగుమతులతో అపార సిరిసంపదలకు నెలవులు కాగా హామద్ తన దేశంలోని గ్యాస్ నిక్షేపాలపై దృష్టి పెట్టి వాటి ఆధారంగా ప్రపంచ ఇంధన విపణిలో ఖతర్‌కు అద్వితీయ స్థానాన్ని సాధించారు. సహజ వాయువు ఎగుమతులతో సమకూరిన ఆదాయంతో ఖతర్ వాసుల జీవన ప్రమాణాలను ఇతోధికంగా మెరుగుపరిచారు. అమెరికా, ఐరోపా వాసుల కంటే ఖతర్ అరబ్బుల జీవన స్థితిగతులే అన్ని విధాలా సుఖసంతోషాలతో ఉండేందుకు హామద్ పాటుపడ్డారు. సత్ఫలితాలు సాధించారు. నేడు అపూర్వ భాగ్యసీమగా ఖతర్ విలసిల్లుతోంది. అరబ్ రాచరిక పాలకులు సాధారణంగా సుదీర్ఘకాలం లేదా జీవిత పర్యంతం అధికారంలో కొనసాగడం పరిపాటి. హామద్ అలా కాకుండా స్వల్పకాలం మాత్రమే పాలనా బాధ్యతల్లో ఉన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న తన తండ్రిని పదవీచ్యుతుడిని చేసి సింహాసనమెక్కిన షేక్ హామద్.. 18 ఏళ్ల పాటు (1995--2013) పరిపాలించి, కుమారుడు షేక్ తమీంకు రాజుగా పట్టాభిషేకం చేసి విశ్రాంత జీవితంలోకి వెళ్లారు. ఖతర్‌కు రాజకీయంగా ఎనలేని ప్రాధాన్యాన్ని సంతరింపజేయడంతో పాటు హామద్ తన దేశాన్ని ఒక సైనిక శక్తిగా తీర్చిదిద్దారు. మీడియా జగత్తులోను తన దేశం ఒక సముచిత స్థానంలో ఉండాలని భావించి, ఆయన ఆ దిశగా అడుగులు ముందుకు వేసి అద్భుతాలు సాధించారు. అల్ జజీరా... అరబ్బు ప్రపంచాన్ని సమూలంగా మార్చిన టెలివిజన్ ప్రసార చానెల్‌ను నెలకొల్పడమే ఆ దిశగా ఒక విప్లవాత్మక ముందడుగు. వివిధ కారణాల వలన సమాచార మాధ్యమాలపై ఆంక్షలు అమలులో ఉండే అరబ్బు ప్రపంచంలో అల్ జజీరా ఒక నూతన అధ్యాయానికి నాంది పలికింది. వార్త, వ్యాఖ్య, విశ్లేషణలో నిష్ణాతులయిన పాత్రికేయుల సమూహంగా ఆవిర్భవించిన ఈ చానెల్ ఖతర్‌కు ఒక విలక్షణ గుర్తింపును తీసుకువచ్చింది. ఇరాక్, సూడాన్, అఫ్ఘానిస్థాన్, పాలస్తీనా ఆక్రమిత ప్రాంతాలలో దాడులు చేసేందుకు అమెరికా, దాని మిత్ర దేశాలు వెనుకంజ వేసేవి అంటే ఈ చానెల్ కవరేజీనే కారణమని నిస్సంకోచంగా చెప్పవచ్చు. అల్ జజీరా ప్రజాదరణకు అదొక తిరుగులేని తార్కాణం. ట్యూనీసియాలో సంభవించిన ఒక సంఘటనపై అల్ జజీరాలో ప్రసారమైన ఒక వార్త అరబ్ దేశాలలో జాస్మిన్ విప్లవానికి దారితీసింది. యావత్తు ప్రపంచాన్ని కవరేజీ చేసిన ఈ చానెల్‌కు వ్యవస్థాపకుడు అయిన హామద్ ఒక్కసారి కూడా ఇంటర్వ్యూ ఇవ్వకపోవడం ఆసక్తికరం. ఆదాయంతో పాటు జాతీయ భద్రత కూడా అనివార్యమని భావించిన హామద్ తన దేశంలో ఒక భారీ సైనిక స్థావరాన్ని నిర్మించి అమెరికాకు అప్పగించారు. అమెరికా అందులో నిర్వహిస్తున్న సైనిక నియంత్రణా కేంద్రం ప్రపంచంలోని అతిపెద్ద సైనిక స్థావరాలలో ఒకటి. ఒకవైపు ఇజ్రాయెల్ మరోవైపు పాలస్తీనా, ఒకవైపు అమెరికా మరోవైపు తాలిబన్లతో ఏకకాలంలో సాన్నిహిత్యాన్ని కలిగివుండడం ద్వారా ఖతర్ దౌత్యపరంగా తనకంటూ ఒక విశ్వసనీయమైన స్థానాన్ని సంపాదించింది. భారత్--తాలిబన్ల మైత్రి కూడా ఖతర్‌లో మొదలయింది. క్రీడారంగంలో ఏ విధమైన అనుభవం లేకున్నా ప్రపంచ ఫుట్‌బాల్ కప్ పోటీల ఆతిథ్యానికి ముందుకు వచ్చి, ప్రశస్తంగా నిర్వహించి ప్రపంచాన్ని అబ్బురపరచిన దేశం ఖతర్. ఆ దేశంలోని అత్యాధునిక హామద్ అంతర్జాతీయ విమానాశ్రయం భారత్, ఇతర ఆసియా దేశాల నుంచి ఉత్తర అమెరికా, ఐరోపా ఖండాలకు రాకపోకలు సాగించే మార్గంలో కీలక అనుసంధాన కేంద్రంగా ఉన్నది. అనతికాలంలో ప్రపంచంలోని అత్యున్నత విమానయాన సంస్థలలో ఒకటిగా ఎదిగిన ఖతర్ ఏయిర్‌వేస్ కార్యకలాపాలకు ఆ విమానాశ్రయమే కేంద్రంగా ఉన్నది. మన ఎయిర్ ఇండియాకు ఉన్న విమానాల కంటే ఖతర్ ఎయిర్‌వేస్‌కు ఉన్న విమానాలే ఎక్కువ. ఖతర్‌ను ఆధునికంగా తీర్చిదిద్ది, జాతి సంపదను ప్రజా శ్రేయస్సుకు, విశాల ప్రపంచ పురోగతికి వినియోగించడంలో తనకు తానే సాటి అని నిరూపించిన షేక్ హామద్ నిత్య స్మరణీయుడు.

# న్యాయ వ్యవస్థ స్వతంత్రత కోల్పోతున్నదా?








ఒక తండ్రి తన అయిదేళ్ల కుమారుడిని స్కూలుకు తీసుకువెళుతుండగా, ఒక ట్యాంకర్ వెనుకనుంచి వచ్చి ఢీకొనడంతో ఆ బాలుడు మరణించాడు. ఆ రోడ్డుకు ఫుట్‌పాత్ కానీ, రోడ్డు దాటేందుకు క్రాసింగ్ గుర్తులు కానీ లేవు. దేశంలో ఇలాంటి ఘటనలు పెద్ద సంఖ్యలో జరుగుతూనే ఉంటాయి కానీ ఉన్నత న్యాయస్థానం మాత్రం ఈ విషాద ఘటనపై అరుదైన రీతిలో స్పందించింది. నడిచి వెళ్లడం అనేది ఆర్టికల్ 19(1)(డి), ఆర్టికల్ 21 క్రింద ప్రాథమిక హక్కులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ ఆదేశాలు జారీ చేశారు. రహదారులను వాహనాల కోసమే కాకుండా పాదచారులకు అనువైన విధంగా నిర్మించాలని ఆయన చెప్పారు. భారతదేశంలో నడిచి వెళ్లడం అనేదానికి సాంస్కృతిక, మతపరమైన, రాజకీయ, సామాజిక విలువ ఉన్నదని కూడా ఆయన గుర్తు చేశారు. దండి యాత్ర, భూదానోద్యమం లాంటి చారిత్రక ఘటనలను జస్టిస్ నరసింహ ఉదహరించారు. నడిచి వెళ్లడమే ఒక ఘర్షణగా మారిన ఈ దేశంలో ఏటా సగటున 36,500 మంది పాదచారులు సరైన ఫుట్‌పాత్‌లు, క్రాసింగ్‌లు లేక మరణిస్తున్నారని ఒక అధ్యయనం వెల్లడించింది. 80శాతం పట్టణ రోడ్లలో సురక్షితమైన, నడిచివెళ్లే వారికి అనువైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల ఈ ఘటనలు జరుగుతున్నాయి. మెట్రో నగరాల్లో 44శాతం రోడ్లకు అసలు ఫుట్‌పాత్‌లే లేవు. ఉన్న ఫుట్‌పాత్‌లలో అత్యధికం ఇండియన్ రోడ్ కాంగ్రెస్ విధించిన నిబంధనలకు అనుగుణంగా లేవు. వికసిత్ భారత్, ట్రిలియన్ ఎకానమీ, విశ్వనగరాల గురించి మాట్లాడే ప్రభుత్వ పెద్దలకు దేశంలో నడిచివెళ్లే వారి దుస్థితి గురించి ఎంతవరకు తెలుసు? ప్రజల ప్రాథమిక హక్కులకు అనుగుణంగా చట్టాలు చేయకపోవడాన్ని ఈ సందర్భంగా జస్టిస్ నరసింహ ప్రశ్నించారు. మోటారు వాహనాల చట్టం చేసినప్పుడు నడిచి వెళ్లే ప్రజల ప్రాథమిక హక్కును గుర్తించలేదని, ఈ చట్టం కేవలం వాహనాల కోసమే చేసినట్లున్నదని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ప్రధాన న్యాయమూర్తి కానున్న రెండో తెలుగువాడైన జస్టిస్ పీఎస్ నరసింహ నడకను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని తీర్పు ఇచ్చిన తర్వాత ప్రజల నుంచి విపరీతమైన ప్రతిస్పందన వచ్చింది. అనేక నగరాల్లో ఫుట్‌పాత్‌లు లేకపోవడం గురించి కథనాలు వస్తున్నాయి. రూల్ ఆఫ్ లా, స్వతంత్ర వైఖరి, ప్రమాణాల గురించి న్యాయవాదులు ముందుగా తెలుసుకోవాలని, విశ్వసనీయత పెంచుకోవాలని జస్టిస్ నరసింహ ఇచ్చిన మరో తీర్పుకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సానుకూలంగా స్పందించింది. జస్టిస్ నరసింహ సూచించినట్లుగా న్యాయవాదులకు జాతీయ లీగల్ అకాడమీని ఏర్పర్చేందుకు సిద్ధమయింది. 'గురుబ్రహ్మా, గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః' అని శ్లోకాలు చదవడం ప్రధానం కాదు, ఆ గురువులకు సరైన జీతాలు ఇవ్వాలి.. అని గుజరాత్ విద్యాలయాల్లో అధ్యాపకులకు కనీస వేతన స్కేలును వర్తింపచేయాలని జస్టిస్ నరసింహ ఇచ్చిన తీర్పును కూడా అనేకమంది స్వాగతించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ పేరిట రాజస్థాన్ గుజరాత్ గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షులకు ముప్పు రాకుండా ఆయన అడ్డుకున్నారు. మండుటెండల్లో మంచి చినుకుల్లాగా అప్పుడప్పుడూ జస్టిస్ నరసింహ మాత్రమే కాదు, జస్టిస్ ఉజ్జ్వల్ భయాన్, జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ నాగరత్న, జస్టిస్ విశ్వనాథన్ తదితరులు ఇచ్చిన కొన్ని మంచి తీర్పులను విస్మరించలేం. వందమీటర్ల ఎత్తు దాటితే ఆరావళి పర్వతాలను కూల్చివేయవచ్చని ఇచ్చిన తీర్పును పర్యావరణవేత్తల ఆందోళనతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిలిపివేశారు. పలు చెప్పుకోదగ్గ తీర్పులు అడపాదడపా సుప్రీంకోర్టు నుంచి వస్తున్నప్పటికీ న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తోందా అన్న చర్చ మాత్రం ఆగడం లేదు. దేశంలో ఉన్నత న్యాయస్థానం పాత్ర రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతున్న విషయం చర్చనీయాంశమవుతోంది. సుప్రీంకోర్టు అస్తిత్వం కోల్పోతోందని, ఎవరి నియంత్రణలోనో ఉన్నట్లుగా వ్యవహరిస్తోందని, ప్రాథమిక హక్కులను విస్మరిస్తోందని మాజీ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు విసిరిన ఘటనను దేశం మరిచిపోకముందే గతవారం ఒక పిటిషనర్ నిండు కోర్టులో సీజేఐపై అసభ్య వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి ఘటనలు సర్వోన్నత న్యాయస్థానం పట్ల పెరుగుతున్న నిరాశా నిస్పృహలకు సంకేతాలుగా అభివర్ణించేవారున్నారు. మరో వైపు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీ ఎత్తున డబ్బు దొరికిన ఘటన రీత్యా ఆయనపై మహాభియోగం ప్రవేశపెట్టేందుకు పార్లమెంట్ సిద్ధమవుతోంది. న్యాయవ్యవస్థను ఆత్మరక్షణలో పడవేసేందుకు లభించే అవకాశాన్ని ప్రభుత్వం ఎందుకు వదులుకుంటుంది? రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవాలంటే న్యాయవ్యవస్థ స్వతంత్రత అవసరం అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్వయంగా స్టాక్ హోమ్‌లో జరిగిన ఒక సదస్సులో అభిప్రాయపడ్డారు. ప్రాథమిక హక్కులను కాపాడిన కేశవానంద భారతి, సమాఖ్య స్ఫూర్తిని పరిరక్షించిన ఎస్.ఆర్ బొమ్మై తదితర కేసులను ఆయన ఉటంకించారు. ఈ తీర్పులు చరిత్ర పుటల్లో కెక్కాయి. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు స్వేచ్ఛగా సజావుగా ఎలాంటి బయటి ఒత్తిడి లేకుండా వ్యవహరించేందుకు సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు జోక్యం చేసుకుంది. మరి గత కొన్నేళ్లుగా సుప్రీంకోర్టు నుంచి ఇలాంటి ఎన్ని అద్భుతమైన తీర్పులు వచ్చాయి? కొన్ని హైకోర్టుల నుంచి కూడా ఇటీవలి కాలంలో మంచి తీర్పులు వచ్చిన ఉదంతాలు లేకపోలేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తే నగర బహిష్కారం విధిస్తారా? అని బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవ్ జె జమ్దార్ ప్రశ్నించారు. ప్రజలు ప్రభుత్వానికి బానిసలు కాదు, ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపడం, నినాదాలు చేయడం వారి హక్కు అని ఆయన ప్రకటించారు. పోలీసులు ప్రజలకు సేవకులే కానీ ప్రభుత్వానికి కాదని జస్టిస్ మాధవ్ స్పష్టం చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ అకౌంట్‌ను బ్లాక్ చేయడాన్ని ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు ఆ అకౌంట్‌పై నిషేధం ఎత్తివేయాల్సిందిగా ఆదేశించింది. 'న్యాయమూర్తులేమీ పవిత్రమైన గోవుల్లాంటి వారు కాదు, వారిలో కూడా అవినీతిపరులు ఉన్నారు' అని మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఒక న్యాయమూర్తి అవినీతికి పాల్పడిన విషయాన్ని చూపించిన సినిమాను నిషేధించాలని దాఖలైన పిటిషన్‌పై అలా స్పందించింది. విచిత్రమేమంటే న్యాయవ్యవస్థలో అవినీతి ఉన్నదని ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకంలో పేర్కొన్నందుకు సుప్రీంకోర్టు మూడో కన్ను తెరిచి ఆ పేరాను మార్పించింది. కోర్టుల్లో వేలాది కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు గతంలో చెప్పిన వివరాలను కూడా కొత్త అధ్యాయంలో తీసేశారు. కార్యనిర్వాహక వ్యవస్థ, చట్టసభలకు అతీతంగా న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తుందని ఆ పాఠ్యపుస్తకంలో పేర్కొన్నారు. నిజంగా అలా జరుగుతోందా? ప్రపంచ జస్టిస్ నివేదిక ప్రకారం, రూల్ ఆఫ్ లా విషయంలో భారతదేశం 86వ స్థానంలో ఉన్నది. అమెరికాకు చెందిన ఒక స్వతంత్ర సంస్థ రూపొందించిన ఆ నివేదిక ప్రకారం, అమెరికాలో కూడా రూల్ ఆఫ్ లా అంత గొప్పగా లేదని, ఆ విషయంలో అది 36వ స్థానంలో ఉన్నదని తేల్చింది. ప్రపంచంలో నాలుగోవంతు దేశాలు నిరంకుశత్వంలోకి జారిపోతున్నాయని అందులో అమెరికా, ఇండియా కూడా ఉన్నాయని స్వీడెన్‌కు చెందిన వీడెమ్ ఇనిస్టిట్యూట్ నివేదిక తెలిపింది. ఉదారవాద ప్రజాస్వామిక దేశం అన్న గుర్తింపును అమెరికా యాభై ఏళ్ల తరువాత తొలిసారి కోల్పోయిందని ఆ నివేదిక పేర్కొంది. భారత్‌లో పద్ధతి ప్రకారం వ్యవస్థలు కూలిపోతున్నాయని వెల్లడించింది. ప్రభుత్వాలు నిరంకుశంగా మారితే దాని ప్రభావం వ్యవస్థలపై నేరుగా ఉంటుందన్న విషయం వేరే చెప్పనక్కర్లేదు. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి గురించి, వెలుపలి శక్తుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల గురించి సిట్టింగ్ న్యాయమూర్తులైన జస్టిస్ నరసింహ, జస్టిస్ ఉజ్జ్వల్ భయాన్, జస్టిస్ నాగరత్న, జస్టిస్ దీపాంకర్ దత్తా తదితరులు పదే పదే హెచ్చరిస్తూనే ఉన్నారు. కోర్టుల స్వతంత్రతకు అతి పెద్ద ముప్పు కోర్టుల నుంచే వస్తోందని ప్రస్తుత న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జ్వల్ భయాన్ చెప్పారు... ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా ఉన్నదని చెబితే సరిపోదు, అది స్వతంత్రంగా పనిచేస్తున్నట్లు తెలియాలి అని జస్టిస్ దీపాంకర్ దత్తా అన్నారు. మాజీ న్యాయమూర్తుల్లో కూడా ప్రస్తుత పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తున్న వారున్నారు. సమాఖ్య వ్యవస్థ ప్రమాదంలో పడిందని జస్టిస్ కురియన్ ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ లేకుండా వేలాది మంది జైళ్లలో మగ్గుతున్నారని జస్టిస్ మదన్ లోకూర్ అంటే, ప్రాథమిక హక్కులను కాపాడే విషయంలో సుప్రీంకోర్టు నిదానంగా వ్యవహరిస్తోందని జస్టిస్ దీపక్ గుప్తా విమర్శించారు. సీనియర్ న్యాయవాదులూ ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేస్తున్నారు. న్యాయవ్యవస్థ ప్రభుత్వ ఆగడాల నుంచి ప్రజలను కాపాడలేకపోతున్నదని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దుశ్యంత్ దవే అన్నారు. గత కొన్నేళ్లుగా సుప్రీంకోర్టు నాయకత్వం దేశాన్ని, న్యాయవ్యవస్థను విఫలం చేసిందని ఆయన ఆరోపించారు. కపిల్ సిబాల్, ప్రశాంత్ భూషణ్, ఇందిరా జైసింగ్, సంజయ్ హెగ్డే తదితరులు కూడా తరచూ న్యాయ వ్యవస్థ దుస్థితిని ఎత్తిచూపుతున్నారు. ఈ దేశంలో ప్రజల కన్నా ప్రభుత్వాలే అభద్రతలో పడ్డట్లు అసహనానికి ఎక్కువగా గురవుతున్నట్లు కనపడుతోంది. పాలనపై దృష్టి కేంద్రీకరించాల్సిన ప్రభుత్వాలు తమ అసహనాన్ని, అభద్రతా భావాన్ని ప్రజలు, వ్యవస్థలపై చూపించినప్పుడే దుష్పరిణామాలు సంభవిస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

# పార్ట్ టైం పీహెచ్డీ స్కాలర్షిప్ పై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీని విజ్ఞప్తి చేసిన సందీప్ గౌడ్


Kukatpally, HYDERABAD - 500 085, Telangana

Dr. A. CHENNAKESAVA REDDY
Sr. Professor of Mechanical Engineering
& DIRECTOR

Tel: 9154089525
directorrnd@jntuh.ac.in
chennakesava@jntuh.ac.in

Date: 31.01.2026

Show-Cause Notice No.: JNTUH/R&D/Disciplinary Action/396/2026

**SHOW-CAUSE NOTICE**

To
Mr. J. Dileep
Ph.D. Scholar (External)
HT No.: 2301203003
Department of Mechanical Engineering
JNTUH University College of Engineering Science & Technology, Hyderabad

Sub: JNTUH – R&D Cell – Involvement in repeated acts of indiscipline, obstruction of University officials and violation of Ph.D. Academic Regulations – Show-Cause Notice – Reg.

Ref: 1. Report of the Committee constituted by the Principal, JNTUH UCESTH regarding incidents occurred in hostel and college premises from 06.03.2025 to 08.03.2025.
2. Report of the University Committee dated 30.05.2025.
3. Letter dated 29.04.2025 of the Station House Officer, KPHB Police Station, Hyderabad addressed to the Registrar, JNTUH.
4. Memo No. JNTUH/UCESTH/DC/11/2024 dated 27.06.2024.
5. Note Orders of the Hon'ble Vice-Chancellor dated 13/05/2025.

*****


It is reported that you, being an external Ph.D. scholar registered with the Department of Mechanical Engineering, JNTUH UCESTH, have indulged in serious acts of indiscipline and misconduct on multiple occasions, as detailed below:

1). That you participated in and actively led the rally held on 07.03.2025 within the Hostel and College premises and obstructed the lawful duties of faculty members and University authorities.

2). That during the said rally, you misbehaved with the CRC Chairperson, JNTUH UCESTH, and created disorder within the campus, thereby disturbing the academic and administrative functioning of the University.

3). That a Committee constituted by the Principal, JNTUH UCESTH investigated the incidents of indiscipline and misbehaviour that occurred from 06.03.2025 to 08.03.2025 and submitted its report, based on which disciplinary penalties were imposed on several students, including:
(i) Permanent expulsion from hostel,
(ii) Suspension from college and hostel, and
(iii) Barring from examinations and entry into campus for one semester.

1 of 2


4). That the Committee specifically noted that you obstructed faculty members during the rally and misbehaved with the CRC Chairperson, and further observed that you have a previous record of indiscipline vide Memo No. JNTUH/UCESTH/DC/11/2024 dated 27.06.2024.

5). That a criminal case (FIR) has been registered against you at KPHB Police Station on the complaint of Mr. Kumara Swamy, Security Officer, JNTUH, and the matter is under active investigation by the Sub-Inspector of Police.

6). That you have also misbehaved with Mr. K. Kumara Swamy, Security Officer, while on duty, for which you had submitted an apology before the Committee.

7). That the University has received an official communication from the Station House Officer, KPHB Police Station, informing that about ten (10) criminal cases are registered against you in connection with incidents involving JNTUH students and student-related disturbances.

8). That you were bound over before the Executive Magistrate for maintaining good behaviour, and despite such binding over, you have continued to indulge in acts of indiscipline and provocation of students, causing nuisance and disturbance to peace and tranquility within the University campus.

9). That you were earlier warned by the University for creating disturbance and provoking students, but you have not reformed your conduct and have repeatedly violated University discipline.

10). That your above conduct clearly amounts to gross misconduct, insubordination, disorderly behaviour and moral turpitude, and constitutes violation of Clause 19.15.7 of JNTUH Ph.D. Academic Regulations 2021-22, besides violation of University discipline norms.

Therefore, you are hereby called upon to SHOW CAUSE:

11). Why severe disciplinary action, including expulsion from the Ph.D. Programme and cancellation of registration, should not be taken against you for the above acts of misconduct.

12). You are directed to submit your written explanation within seven (7) days from the date of receipt of this notice, along with documentary evidence, if any, in your defence.

13). If no explanation is received within the stipulated time, it shall be presumed that you have no explanation to offer, and the matter will be processed ex-parte for appropriate disciplinary action as per rules, without any further notice.

14). This notice is issued in compliance with the principles of natural justice and without prejudice to any other action that may be taken against you under the JNTUH Act, Statutes, Ph.D. Regulations and applicable criminal law.

Dr. A Channakesava Reddy
Director
Directorate of Research & Development
JNTUH, Hyderabad

2 of 2



( జూలై – 15– హంస కలంవార్త )

జేఎన్టీయూహెచ్ రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ డైరెక్టర్ డా. టి. సత్య సావిత్రి ని కలిసి, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పార్ట్టైమ్ పీహెచ్డీ స్కాలర్ జవ్వాజీ దిలీప్ (హాల్ టికెట్ నెం. 2301203003) కు సంబంధించిన పలు అంశాలపై సమగ్ర విచారణ జరిపి, యూనివర్సిటీ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించడం జరిగింది.

**– పి హెచ్ డి స్కాలర్ పితాని సందీప్ గౌడ్.**

వినతిపత్రంలో ప్రధానంగా, పార్ట్టైమ్ పీహెచ్డీ ప్రవేశ సమయంలో సమర్పించిన ఎన్ఓసి మరియు ఉద్యోగ సంబంధిత పత్రాల ప్రామాణికతను పరిశీలించాలనిలి, ప్రవేశం పొందిన నాటి నుండి ఇప్పటి వరకు ఆయన నిజంగా ఉద్యోగంలో కొనసాగుతున్నారా లేదా అధికారికంగా ధృవీకరించాలని కోరాము. అవసరమైతే సంబంధిత సంస్థ నుండి పే స్లిప్స్, బ్యాంక్ స్టేట్మెంట్లు, ఫామ్ 16, ఆఫర్ లెటర్, ఉద్యోగ ధృవీకరణ పత్రాలు పరిశీలించి పార్ట్టైమ్ పీహెచ్డీ నిబంధనలు పాటించబడుతున్నాయా లేదా నిర్ధారించాలని విజ్ఞప్తి చేశాము. అలాగే, యూనివర్సిటీలో పార్ట్టైమ్ పీహెచ్డీ స్కాలర్గా ఉంటూ రోజంతా క్యాంపస్లో గడపడం, వివిధ విద్యార్థి కార్యక్రమాల్లో పాల్గొనడం, ఇటీవల అనేక అంశాలపై జరిగిన ఆందోళనల నేపథ్యంలో ఆయన పాత్రపై వచ్చిన ఫిర్యాదులను అధికారిక రికార్డులు, సీసీటీవీ ఫుటేజ్ మరియు ఇతర ఆధారాల ఆధారంగా నిష్పాక్షికంగా విచారించాలని కోరాము. ఇంకా, 31-01-2026 తేదీన అప్పటి రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగం జారీ చేసిన షోకాజ్ నోటీసు ప్రస్తుత స్థితి ఏమిటి, దానిపై ఎలాంటి విచారణ జరిగిందో, ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని విజ్ఞప్తి చేశాము. దిలీప్ పి హెచ్ డి ప్రవేశ సమయంలో అప్పటి ఆర్ ఒ డీ డైరెక్టర్ మరియు పి హెచ్ డి గైడ్/సూపర్వైజర్ డా. కె. విజయ కుమార్ రెడ్డి కాలంలో సమర్పించిన పత్రాలు పూర్తిగా పరిశీలించబడ్డాయా, అనంతరం డైరెక్టర్లుగా పనిచేసిన డా. ఎస్. వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ వి. కామాక్షి ప్రసాద్, డా. చెన్నకేశవ రెడ్డి కాలంలో ఈ అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే విషయాలను కూడా పరిశీలించాలని కోరాము. జేఎన్టీయూహెచ్ వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో పరిశోధన ప్రమాణాలు, అకడమిక్ క్రమశిక్షణ మరియు విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఈ అంశాలపై పూర్తిస్థాయి, నిష్పాక్షిక విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి యూనివర్సిటీ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని విశ్వ విద్యార్థుల విద్యార్థులుగా రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ను కోరాము. కార్యక్రమంలో పరిశోధక విద్యార్థి చల్ల రామకృష్ణ రెడ్డి, ఇంజనీరింగ్ విద్యార్థులు జయరాం, సాయిరాం, విశ్వజిత్, మనీష్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సిఈ బచ్చు రవీందర్ అరెస్టు

**-తవ్వినకొద్దీ అక్రమాస్తులు సుమారుగా రూ. 100 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు**

**-హైదరాబాద్,నిజామాబాద్తో పాటుమరో 10ప్రాంతాల్లో సోదాలు**

**-సీఈ అనుచరులను ఏసిబి అధికారులు ప్రశ్నించే అవకాశం**

హంసకలం వార్త

హెచ్ఎండిఏలో మరో తిమింగలం ఏసిబి వలకు చిక్కింది. రెండేళ్ల క్రితం ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అప్పటి హెచ్ఎండిఏ డైరెక్టర్ బాలకృష్ణను ఏసిబి అధికారులు అరెస్టు చేయగా, ప్రస్తుతం మంగళవారం హెచ్ఎండిఏ సీఈ బచ్చు రవీందర్పై ఏసిబి దాడులు నిర్వహించగా సుమారుగా రూ. 100 కోట్ల ఆస్తులు ఉన్నట్టుగా గుర్తించింది. ఈ నేపథ్యంలోనే ఆదాయానికి మించి ఆస్తుల కేసులో హెచ్ఎండిఎ సిఈ బచ్చు రవీందర్ను ఏసిబి అధికారులు మంగళవారం సాయంత్రం అరెస్టు చేశారు. 2024 ఆగష్టులో సీఈగా పదోన్నతి పొందిన రవీందర్ హెచ్ఎండిఏ సీఈగాబాధ్యత లను నిర్వహిస్తున్నారు. 2024 జూలై వరకు రవీందర్ హెచ్జిసిఎల్ (హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్)లో సిజిఎంగా పనిచేశారు. అప్పట్లోనే రవీందర్పై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. హెచ్జిసిఎల్ ఆధ్వర్యంలో జరిగిన కొన్ని నిర్మాణాల్లోనూ అవకతవకలు జరిగాయని అందులో సిజిఎం రవీందర్ హస్తం ఉందని అప్పట్లోనే ఆయనపై అవినీతి ఆరోపణలు వినిపించాయి. 2024 ఆగష్టులో సీఈగా బచ్చు రవీందర్కు పదోన్నతి రావడంతో కొందరు కాంట్రాక్టర్లతో ఆయన కుమ్మక్కయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీఈగా బాధ్యతలు నిర్వహించిన ఈ సంవత్సరంన్నర కాలంలో పార్కులు, ఫ్లైఓవర్లు, ఎకో పార్కు పెండింగ్ పనులను ఈయన హయాంలోనే చేపట్టారు. దీంతోపాటు ఎలివేటెడ్ కారిడార్ పనుల కోసం భూ సేకరణ చేపట్టడం తదితర పనులు ఈయన హయాంలోనే జరిగాయి. అయితే, ఈ పనుల నిమిత్తం కొందరు కాంట్రాక్టర్లతో ఈయన కుమ్మక్కైనట్టుగా ప్రభుత్వానికి ఫిర్యాదులు అందినట్టుగా తెలిసింది. దీంతోపాటు సీఈ రవీందర్ ముఖ్య అనుచరులుగా కొందరు ఈఈలు, ఎస్ఈలు వ్యవహరిస్తూ కాంట్రాక్టర్ల భారీగా ముడుపులు స్వీకరించినట్టుగా ప్రభుత్వానికి ఫిర్యాదు అందడంతో ఈయన అవినీతిపై ఏసిబి దృష్టి సారించింది. దీంతో ఒకేసారి మంగళవారం హైదరాబాద్, నిజామాబాద్తో పాటు మరో 10 ప్రాంతాల్లో సోదాలు చేపట్టి భారీగా ఆస్తులను గుర్తించింది. త్వరలోనే ఈయన అనుచరులను కూడా ఏసిబి అధికారులు ప్రశ్నించే అవకాశంఉందని తెలిసింది. ఇల్లు, కార్యాలయంలో లభించిన నగదు, డాక్యుమెంట్లకు మైత్రివనం లో ఉన్న హెచ్ఎండిఎ కార్యాలయం, గచ్చిబౌలి సుమధుర టవర్స్లోని బచ్చు రవీందర్ నివాసంతో పాటు ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఏక కాలంలో ఏసిబికి చెందిన 15 బృందాలు ఈ సోదాలు నిర్వహించాయి. ఎసిబి డిఎస్పి మాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నుంచి ఈ తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్,నిజామాబాద్తో పాటుమరో 10ప్రాంతాల్లో సోదాలు హైదరాబాద్, నిజామాబాద్తో పాటు మరో 10 ప్రాంతాల్లో సోదాలు చేపట్టి రవీందర్ ఇంట్లో భారీగా ఆస్తులు గుర్తించారు. స్థిర చరాస్తులు కలిపి 9.24 కోట్ల రూపాయల ఆస్తులు గుర్తించినట్టుగా ఎసిబి తెలిపింది. బహిరంగ మార్కెట్లో వీటి విలువ సుమారు రూ. 50 నుంచి రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని ఏసిబి అధికారులు పేర్కొన్నారు. కొండగల్, కిష్టాపూర్, పసుమాముల ప్రాంతాల్లో రూ. 38,89,700 లక్షల



విలువ చేసే 5 ఓపెన్ ప్లాట్లు, నార్సింగ్ అండ్ నానక్రామ్గూడలో రూ. 2.07 కోట్లు విలువ చేసే 4 ఫ్లాట్లు, కొత్తూరు మండలం గూడురు గ్రామంలో 4 ఎకరాల వ్యవసాయ భూమి, మోకిలలో 1.33 కోట్ల విలువ చేసే విల్లా, కొండపూర్ మసీదు బండలో రూ. 3 కోట్లు విలువ చేసే 4 అంతస్తుల భవనం, ఇంట్లో రూ. 3.82 లక్షల నగదు గుర్తింపు, బ్యాంకు ఖాతాల్లో రూ. 45,05,776 నగదు, రూ. 36,70,000 లక్షలు విలువ చేసే 1440 గ్రాముల బంగారం, రూ. 10,00,000 లక్షలు విలువ చేసే 12.5 కిలోల వెండి, రూ. 17,24,000 విలువ చేసే గృహోపకరణాలు, 9.32 లక్షల విలువ చేసే ఎలక్ట్రానిక్ వస్తువులు 7 శాంసంగ్ మొబైల్ ఫోన్లు, రెండు స్మార్ట్ వాచెస్, ఒక ఐ పాడ్, రెండు టాబ్లు, 5 హార్డ్ డిస్క్లు, రూ. 1.16 కోట్ల విలువ చేసే కార్లు రూ. 40,00,000 విలువ చేసే ఇన్నోవా హైక్రాస్, రూ. 31,00,000 విలువ చేసే టాటా సఫారీ, రూ. 25,00,000 విలువ చేసే ఇన్నోవా క్రిస్టా, రూ. 20,00,000 విలువ చేసే మహీంద్రా ఎక్స్యూవీ ఉన్నట్లు ఏసిబి అధికారులు గుర్తించారు. సోదాలు నిర్వహించిన అనంతరం రవీందర్ ఇల్లు, కార్యాలయంలో లభించిన నగదు, డాక్యుమెంట్లకు లెక్కలు లేకపోవడంతో అక్రమాస్తులుగా ఎసిబి అధికారులు వాటిని గుర్తించారు. వైద్య పరీక్షల అనంతరం రవీందర్ను కోర్టులో హాజరు పరిచారు

# ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

హంసకలం వార్త

జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మరింత మెరుగు పర్చేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సబ్జెక్టుల వారీ వృత్యంతర శిక్షణా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ శ్రీ బి. సత్యప్రసాద్ తనిఖీ చేశారు. ల్లా కేంద్రంలోని జ్ఞాన హైస్కూల్లో ఆంగ్లం సబ్జెక్టుకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించిన కలెక్టర్, శిక్షణ నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ (ఆర్పీ) బోధనను తరగతి గదిలో కూర్చొని ప్రత్యక్షంగా వీక్షించి, ముఖ్యంగా కృత్రిమ మేధ ను తరగతి గదిలో విద్యార్థుల అభ్యాసానికి ఎలా సమర్థవంతంగా వినియోగించుకోవచ్చనే అంశంపై అందించిన శిక్షణను ఆసక్తిగా పరిశీలించారు. ఆంగ్ల భాష బోధనలో స్పోకెన్ ఇంగ్లీష్, విద్యార్థి-కేంద్రిత బోధనా పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, కృత్రిమ మేధ ఆధారిత బోధనా విధానాలపై ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయా ని సూచించారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజ నాత్మకత, ఆలోచనా సామర్థ్యాలను పెంపొంది ంచడంలో ఆధునిక బోధనా విధానాలు ఎంతో



ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి శిక్షణా అవకాశాలను ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**– జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



హంసకలం వార్త

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు.క్యాంపు కార్యాలయం నుండి ఆయన గూగుల్ మీట్ ద్వారా రెవెన్యూ, ఎన్నికల శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రస్తుత పురోగతి,క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు,పెండింగ్ దరఖాస్తులు,ఆన్లైన్ నమోదు, డిజిటలైజేషన్ తదితర అంశాలపై శాఖల వారీగా సమీ క్షించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావు ఇవ్వకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడంతో పాటు ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, బీఎల్వోలు, సూపర్వైజర్లు,మండల స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,ప్రతి దశను నిబంధనల ప్రకారం పూర్తి చేసి,అర్హులైన ప్రతి ఓటరికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.

## ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలి

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**





హంసకలం వార్త

ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా విద్యాశాఖ పై సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ బోధన చేయాలన్నారు.ప్రతి రోజు తప్పనిసరిగా మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు ఖచ్చితంగా ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు చేయాలని చెప్పారు.విద్యార్థులకు సబ్జెక్టుల వారిగా సులువుగా అర్థమయ్యే విధానాలు అవలంబిస్తూ విద్యా బోధన చేయాలని అన్నారు.వారి నైపుణ్యాలు పెరిగేవిధంగా సామూహిక చర్చల ద్వారా కొత్త విషయాలు నేర్చుకునే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు.విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేయడానికి వారాల,నెలల వారిగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు పోషకులతో సమావేశాలు నిర్వహిస్తూ ఉండాలన్నారు. ఇంటికి వెళ్ళిన తర్వాత విద్యార్థులు సబ్జెక్టులు చదువుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.తరచూ తరగతులకు రాని,చదువు మానేసిన విద్యార్థులను బడులకు తీసుకువచ్చే విధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలు ఏంటో తెలుసుకోవాలన్నారు. ప్రతిరోజు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పూర్తిగా ఉండాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ లోకల్తీ ఐస్ క్రీం!ఐస్ క్రీమ్ తయారీ కేంద్రంపై ఎస్ఓటి పోలీసులు దాడి.

**-ఆకస్మిక తనిఖీలు భారీగా కల్తీ ముడిపదార్థాలు సీజ్!**

హంసకలం వార్త



రామంతాపూర్ లక్ష్మీనారాయణ కాలనీలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గడువు ముగిసిన ఫుడ్ కలర్స్, ఫ్లేవర్లు ఉపయోగిస్తు ఒడడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఫంగస్ పట్టిన ఎండు అంజీర్తో ఐస్క్రీమ్ తయారీ చేస్తున్నట్టు గుర్తించారు. లేబుల్ లేని ముడి పదార్థాలు, లూజ్ టూటీ ఫ్రూటీ వినియోగి స్తున్నారని, భారీగా కల్తీ ముడి పదార్థాలను అధికారులు సీజ్ చేశారు. యూనిట్ నిర్వాహకుడు మందుల రమేష్ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. స్థానిక దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో రమేష్ వెల్లడించారు

## జూలై 31లోగా జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

-జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

-నవంబర్ 28న జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్

హంసకలం వార్త



జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో 2027-28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ కు జిల్లాలోని అర్హులైన ఐదో తరగతి విద్యార్థులు జూలై 31, 2026లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ల్లాలో ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల సమర్పణకు జూలై 31, 2026చివరి తేదీ కాగా, ప్రవేశ పరీక్ష 2026 నవంబర్ 28న నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి అర్హులైన విద్యార్థికి ఈ ప్రవేశ పరీక్షపై పూర్తి అవగాహన కల్పించి, అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు నమోదయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు మండల విద్యాధికారులు, ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, గుర్తింపు పొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవసరమైన సూచనలు జారీ చేసి, అర్హులైన ప్రతి ఐదో తరగతి విద్యార్థికి సమాచారం అందించడంతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో తల్లిదండ్రులకు అవసరమైన సహకారం అందిం చాలని సూచించారు. మండలాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులను నిరంతరం పర్యవేక్షిస్తూ గరిష్ట నమోదు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ శాఖ అధికారులు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీల ద్వారా ప్రతి గ్రామంలో నోటిఫికేషన్‌పై విస్తృత ప్రచారం నిర్వహించి, గ్రామీణ ప్రాంతాల అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేందుకు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో నాణ్యమైన, ఉచిత వసతి విద్యను అందించే ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జూలై 31లోగా తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## బాసర ఐఐఐటిలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

-రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశం

హంసకలం వార్త



బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఐఐఐటి) విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేసేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. బుధవారం ఆయన వర్సిటీని సందర్శించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ...క్యాంపస్‌లో విద్యార్థులకు నిరంతర విద్యుత్, సురక్షిత త్రాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం,నాణ్యమైన భోజన సదుపాయాలు కల్పించడంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు.ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. ఏ విద్యార్థీ చదువు మధ్యలో ఆపేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని, చదువు పూర్తయిన వెంటనే ఉపాధి అవకాశాలు లభించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వర్సిటీలో అడ్మిషన్ల ప్రక్రియ,విద్యాబోధన తీరుపై ఆయన ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ... విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, విద్యా ప్రమాణాలను పెంచేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభించేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్సిటీ అభివృద్ధి,వసతుల గురించి చైర్మన్‌కు వివరించారు. అనంతరం చైర్మన్ ను, కమిషన్ సభ్యులను అధికారులు సన్మానించారు.ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కుస్రం నీలాదేవి,వైస్ చాన్సలర్ గోవర్ధన్, భైంసా ఏఎస్పీ సాయికిరణ్,డీఎస్పీ వెంకట రామయ్య, ఎస్సీ,ఎస్టీ సెల్ కన్వీనర్ అజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ నుండి యూ.కేకు బియ్యం ఎగుమతులు

హంసకలం వార్త




భారత్--యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ద్వారా ఎగుమ తులకు లభిస్తున్న అవకా శాలను వినియోగిం చుకుంటూ నిజామాబాద్ నగరంలోని గజానన్ రైస్ మిల్ యాజమాన్యం యునైటెడ్ కింగ్‌డమ్‌కు బియ్యం ఎగుమతులకు అనుమతులు సాధించింది. ఈ మేరకు గజానన్ రైస్ మిల్లు నుండి యూ.కే కు ఎగుమతి అవుతున్న సోనా మసూరి ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ బియ్యం నిల్వలతో కూడిన వాహనాలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఈటీఏ అమలుతో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో నాణ్యమైన వరి ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన నిజామాబాద్ జిల్లా నుంచి యూకేకు బియ్యం ఎగుమతులు ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన బియ్యాన్ని ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని దేశాలకు కూడా జిల్లా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగేలా అధికారులు, ఎగుమతిదారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, గజానన్ రైస్ మిల్ ప్రతినిధి హితేష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ ను లైట్ తీసుకుంటే ఓటు గల్లంతే

-మీ ఓటును కాపాడుకోండి

-సర్ అనేది రాజకీయ కార్యక్రమం కాదు

-ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమం

-కరీంనగర్ లో ఎన్యుమరేషన్ దరఖాస్తును నింపిన బండి సంజయ్

-బీఎల్ఓ వద్దకు వెళ్లి ఫారమ్ ను అందజేసిన కేంద్ర మంత్రి

హంసకలం వార్త

రాష్ట్ర ప్రజలంతా తప్పనిసరిగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ"సర్" ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. "సర్ ను లైట్ తీసుకుంటే మీ ఓటు గల్లంతయ్యే ప్రమాదం ఉంది"అని హెచ్చరించారు. సర్ ప్రక్రియను ఎవరూ లైట్ తీసుకోవద్దని కోరారు. 'మీ ఓటును కాపాడుకోండి మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి" అని పిలుపునిచ్చారు.బుధవారం కరీంనగర్ కు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ "సర్" ఫాంను నింపి చైతన్యపురిలోని సాధన స్కూల్ లో ఉన్న బీఎల్ వో అధికారుల వద్దకు వెళ్లి సమర్పి ంచారు. అక్కడే ఆన్ లైన్లోనూ ఆ వివరాలను నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ ఎలా కొనసాగుతోంది"" ఎన్యుమరేషన్ దరఖాస్తులను అందరికీ పంపిణీ చేశారా" ఎంత మంది ఎన్యుమ రేషన్ దరఖాస్తులను నింపి అందజేశారు ఈ విషయంలో ఓటర్లు పడుతున్న ఇబ్బందులేమిటి" అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 24లోపు ఎన్యుమరేషన్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 50 శాతం మంది ఓటర్లు మాత్రమే ఎన్యుమరేషన్ ఫాంలను అందజేశారని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలంతా సర్ ప్రక్రియలో పాల్గొనాలి. ఈనెల 24 వరకు సమయం ఉందని నిర్లక్ష్యం చేయకండి! చివరి రోజు కోసం ఎదురుచూడకండి. ఈ రోజే ఎన్యుమరేషన్ ఫారమ్ నింపండి మీ ఓటును కాపాడుకోండి. అట్లాగాకుండా 'నా దగ్గర ఓటర్ ఐడీ ఉంది నాకు ఏమవుతుందిలే" అని ఇంట్లో కూర్చుంటే రేపు ఎన్నికల రోజు పోలింగ్ బూత్‌కు వెళ్లిన తర్వాత "లిస్టులో మీ పేరు గల్లంతవుతుంది. అందుకే చేతిలో ఓటర్ ఐడీ ఉంటే సరిపోదు ఓటరు జాబితాలో పేరు ఉండాలి. అందులో భాగంగా బీఎల్ఓ మీ ఇంటికి వస్తే సహకరించండి. సర్ ఫారమ్ తీసుకోండి. వివరాలు సరిచూసుకోండి. ఫారమ్ నింపి గడువులోగా అందించండి.ముఖ్యంగా తెలంగాణ యువతను కోరుతున్నా మీ ఫోన్‌లో గంటల తరబడి సోషల్ మీడియా చూస్తారు. రాజకీయాలపై పోస్టులు పెడతారు. ప్రభుత్వాలను తిడతారు. నాయకులను ప్రశ్నిస్తారు. కానీ మీ ఓటు లిస్టులో ఉందో లేదో ఒక్కసారైనా చూసుకున్నారా" ఓటే లేకపోతే మీ ప్రశ్నకు ప్రజాస్వామ్య బలం ఎక్కడిది? మీ ఇంట్లో అమ్మ ఓటు చూడండి. నాన్న ఓటు చూడండి. కుటుంబ సభ్యుల ఓట్లు ఉన్నాయో లేదో చూడండి.ఎందుకంటే ఓటు అంటే కాగితం ముక్క కాదు. ఓటు అంటే ప్రజల చేతిలో ఉన్న అధికారం. ఓటు అంటే ప్రశ్నించే హక్కుకు బలం. ఐదేళ్లు నాయకులు ప్రజల దగ్గరకు రాకపోయినా, ఎన్నికల రోజు మాత్రం ప్రజల దగ్గరకు రావాల్సిందే. ఎందుకు" మీ చేతిలో ఓటు ఉంది కాబట్టి. అలాంటి ఓటును నిర్లక్ష్యంతో పోగొట్టుకుంటారా" ఆలోచించాలని కోరుతున్నా. ఎవరో చూస్తారులే బి ఎల్ ఓ చూసుకుంటారులే పార్టీ వాళ్లు చూసుకుంటారులే. అని వదిలేయొద్దు! మీ ఓటు బాధ్యత మీదే! ముఖ్యంగా ప్రతి యువకుడు "నా కుటుంబంలో ఒక్క ఓటు కూడా పోనివ్వను" అని సంకల్పంతో చేయాలి సర్ అనేది రాజకీయ కార్యక్రమం కాదు ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమం. ఈ రోజు సర్ ఫారమ్‌ను నిర్లక్ష్యం చేస్తే రేపు పోలింగ్ బూత్ దగ్గర పశ్చాత్తాపపడే పరిస్థితి రావచ్చు! మీ ఓటును కాపాడుకోండి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి. ముఖ్యంగా కొన్ని చోట్ల సర్ పేరుతో హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది. మజ్లిస్ తో కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీ హిందువుల ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తోంది. ఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదముంది. తెలంగాణలోని హిందువులంతా జాగ్రుతం కావాలని, లేనిపక్షంలో తెలంగాణలో హిందువులంతా మైనారిటీలయ్యే ప్రమాదం ఉంది.ఈ రోజు ఎన్యుమరేషన్ ఫారమ్ నింపడానికి పది నిమిషాలు కేటాయించకపోతే రేపు ఎన్నికల రోజు "నా ఓటు ఎక్కడ" అని బాధపడాల్సి వస్తుంది. అప్పుడు అధికారులను నిందించినా, వ్యవస్థను ప్రశ్నించినా కాలం వెనక్కి రాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. మీ ఓటు పోతే మీ గొంతు బలహీనపడుతుంది. మీ ఓటు ఉంటే మీ ప్రశ్నకు బలం ఉంటుంది. ప్రజాస్వామ్యంలో నాయకుడి కంటే గొప్పవాడు ఓటర్. ప్రభుత్వాల భవిష్యత్తును నిర్ణయించేది ఓటర్. రాష్ట్ర, దేశ భవిష్యత్తును నిర్మించేది ఓటర్. అలాంటి అమూల్యమైన ఓటు హక్కును నిర్లక్ష్యంతో కోల్పోవద్దు.



# నా గొంతు నొక్కలేరు, జైల్లో పెట్టినా ప్రజల కోసం పోరాటం ఆగదు

- గృహ నిర్బంధంలో కొనసాగిన దీక్ష

-ప్రజా సమస్యల పరిష్కారం కోసమే శాంతియుత దీక్ష.. పోలీసుల నిర్బంధం అప్రజాస్వామికం

-భీంగల్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అడిగితే అరెస్టులు చేస్తారా?

-ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో హామీ ఇవ్వాలని ప్రశాంత్ రెడ్డి డిమాండ్

హంసకలం వార్త

బాల్కొండ నియోజకవర్గం మరియు భీంగల్ ప్రజల దశాబ్దాల కల అయిన అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తలపెట్టిన శాంతియుత 'కఠోర నిరాహార దీక్ష'ను పోలీసు బలగాలతో అడ్డుకోవడం రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక, రాక్షస చర్య అని బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజా సమస్యల సాధన కోసం తాను అహింసా మార్గంలో నిరసన తెలియజేస్తుంటే, ప్రభుత్వం పోలీసులతో ఉక్కుపాదం మోపాలని చూడటం శోచనీయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై, దాదాపు 75 శాతం పనులు పూర్తి చేసుకున్న భీంగల్ 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, భీంగల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలని, మూతపడిన భీంగల్ బస్ డిపోను పునఃప్రారంభించాలని కోరారు. గత మున్సిపల్ ఎన్నికల ముందు రూ. 12 కోట్ల నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పెండింగ్ పనుల సాధన కోసమే 15వ తేదీన చుక్క మంచి నీరు కూడా ముట్టకుండా ఒక రోజు కఠోర నిరాహార దీక్షకు పూనుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ఎలాంటి రాస్తారోకోలు, ధర్నాలు చేయకుండా, తనకు తాను శిక్ష వేసుకుంటూ అత్యంత శాంతియుతంగా ఒకరోజు దీక్ష చేస్తానని ప్రకటిస్తే ప్రభుత్వం ఎందుకు ఉలిక్కిపడుతోందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. తాను ఉదయం నిద్రలేవక ముందే, కనీసం స్నానం కూడా చేయకముందే వందలాది మంది పోలీసులు తన ఇంటిని చుట్టుముట్టి తనను బయటకు వెళ్లనివ్వకుండా గృహ నిర్బంధం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ కార్యకర్తలను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేసి జైళ్లలో పెడుతున్నారని, భీంగల్ లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని తొలగించి, ఫ్లెక్సీలను సైతం చించేయడం ప్రభుత్వ రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వానికి నిజంగా ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే, ఈ అభివృద్ధి పనులను నెల లేదా రెండు నెలల్లో పూర్తి చేస్తామని అధికారికంగా స్పష్టమైన హామీ ఇస్తే తాను తక్షణమే ఈ ఒక్కరోజు చేపట్టిన దీక్ష విరమిస్తానని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. అది చేతకాక, పోలీసులతో బెదిరిస్తే భయపడేది లేదని తేల్చిచెప్పారు. ప్రజా ప్రతినిధిగా ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.తనను ఇంట్లో నిర్బంధించినా, పోలీస్ స్టేషన్ కు తరలించినా, లేదా జైల్లో పెట్టినా తన సత్యాగ్రహం, కఠోర నిరాహార దీక్ష ఎక్కడ ఉంటే అక్కడే కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కాగా అర్ధ రాత్రి నుండి హైడ్రా మొదల య్యింది.ఎమ్మెల్యే బయటకు రాకుండా ఇంటి వద్ద భారీ పోలీస్ బలగాలను మోహరించారు.మిగతా నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.ముందస్తుగా చెప్పిన మాదిరి ఎమ్మెల్యే వేముల.ప్రశాంత్ రెడ్డి ఇంట్లోనే దీక్షకు దిగారు. సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వారి పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు పై ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.పోలీస్ లతో కాసేపు వాగ్వివాదం నెలకొంది.అధికార కాంగ్రెస్ ను డిపెన్స్ లో పడే విధంగా బీ ఆర్ ఎస్ శాంతియుతంగా ధర్నాలు చేపడుతూ కాంగ్రెస్ నిర్లక్ష వైఖరిని ఎండగడుతుంది.



# ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

-28వ డివిజన్ లో పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

హంసకలం వార్త

స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ వేగవంతం చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని 28వ డివిజన్లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు కలిగి ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కావున ఎన్నికల సంఘం నిర్వహి స్తున్న ఎస్ఐఆర్ లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రధానంగా ఎన్యుమరేషన్ పత్రాలను పూర్తిచేసి సంబంధిత బిఎల్ఓ లకు అందజేయాలన్నారు. అనేకమందికి ఎనిమరేషన్ ఫామ్ నింపడంలో గందరగోళం ఏర్పడుతుందని, కావున ఓటర్లకు బిఎల్వోలు, పార్టీ బీఎల్ఎ లు సహకరించాలని సూచించారు. కార్పోరేటర్ల సైతం తమ పరిధిలోని ఓటర్లకు తగు సూచనలు చేస్తూ ఎన్యుమరేషన్ ఫామ్ లను నింపి తిరిగి ఇచ్చేలా చూడాలన్నారు.



-ఎస్ఐఆర్ గడువు పెంపు

కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ గడుపును ఈ నెల 24 నుంచి ఆగస్టు 3వ తేదీకి పొడిగించిందని ఎమ్మెల్యే తెలిపారు. కావున నగరంలోని ఓటర్లందరూ గమనించి నిర్ణీత గడువులోపు ఎన్యుమరేషన్ పత్రాలను సంబంధిత బి ఎల్ ఓ లకు అందజే యాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్కాయి మహేందర్, నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి, నాయకులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

**-జిల్లా విద్యాశాఖ సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి**

హంసకలం వార్త

ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన విద్యను బోధించడం ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. జిల్లాలో ఉత్తీర్ణత మెరుగుపడిందని, ఇదే స్ఫూర్తితో కృషి చేస్తూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా చొరవ చూపాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో బుధవారం జిల్లా విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, గురుకులాల నిర్వహణ తీరుతెన్నులు, సాధించిన ఫలితాలు, మౌలిక సదుపాయాల స్థితిగతులు తదితర అంశాలపై సమీక్ష జరిపి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. విద్యా రంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నారని అన్నారు. విద్యా ప్రమాణాలను మెరుగుపర్చే విషయంలో ప్రభుత్వం ఎంతమాత్రం రాజీ పడబోదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఒక్కో విద్యా సంస్థకు 200 కోట్ల రూపాయల చొప్పున ఖర్చు చేస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తోందని, ఇవి కాకుండా అన్ని రకాల అధునాతన సదుపాయాలతో ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మిస్తోందని గుర్తు చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా సాంకేతిక విద్యకు తోడ్పాటును అందిస్తోందని అన్నారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా తమ బాధ్యతను గుర్తెరిగి నాణ్యమైన విద్యను బోధిస్తూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో ప్రవేశాలు గణనీయంగా పెరిగేలా




చూడాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను ఆదర్శంగా తీర్చిదిద్దాలని అన్నారు. ఆయా సబ్జెక్టులలో వెనుకంజలో ఉన్న విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, నాణ్యమైన పౌష్టిక ఆహారం అందేలా చూడాలన్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తాము కృషి చేస్తామని, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన, క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించాల్సిన బాధ్యత మాత్రం ఉపాధ్యయులదేనని స్పష్టం చేశారు. పీఎంశ్రీ పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిధులు వెనక్కి మళ్లిపోకుండా, ప్రతి పైసా వినియోగంలోకి వచ్చేలా నిర్దిష్ట గడువులోగా అదనపు తరగతి గదులు, ఇతర సౌకర్యాల మెరుగుదలకు సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, విద్యా రంగంలో నిజామాబాద్ జిల్లా పనితీరు సంతృప్తికరంగా ఉందని అన్నారు. ప్రభుత్వ బడులలో విద్యార్థులు ప్రవేశాల విషయంలో రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా ఐదవ స్థానంలో ఉందని, ఈ నెలాఖరు వరకు లక్ష్యానికి అనుగుణంగా ప్రవేశాలు పూర్తి చేసి జిల్లాను ముందంజలో నిలుపుతామని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత విద్యా సంవత్సరంలో 21శాతం మేర ఎక్కువ ప్రవేశాలు జరిగాయని, నెలాఖరు నాటికి మరో 7శాతం ప్రవేశాలు పెంపొందించేలా కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను మండల స్పెషల్ ఆఫీసర్లు, ఆర్.సీ.ఓలు, జిల్లా అధికారులు సందర్శిస్తూ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలిస్తున్నారని అన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారం అందేలా ప్రతి పాఠశాలలో ఆహార భద్రతా కమిటీలను ఏర్పాటు చేయించామని తెలిపారు. బాలికల విద్యాలయాల్లో విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. మెరుగైన విద్యా బోధన అందించడం వల్ల ఈసారి పదవ తరగతిలో కేజీబీవీ, జ్యోతిబాపూలె, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ తో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోనూ మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఎస్సెస్సీలో టాపర్లుగా నిలిచిన లహరిక, సౌజన్య, సంజన, లాస్య, అభిజ్ఞ తదితరులకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించగా, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి తన తరపున ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున నగదు పారితోషికం అందించి ప్రోత్సహించారు. ప్రభుత్వ బడులలో విద్యార్థులు ప్రవేశాలను పెంపొందించేందుకు కృషి చేసిన ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులను సైతం సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం చైర్మన్ శేఖర్ గౌడ్, డీ.ఈ.ఓ అశోక్, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, విద్యా శాఖ అధికారులు, ఆర్.సీ.ఓలు, ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటేందుకు సిద్ధంగా పెట్టాలి

**-వన మహోత్సవంపై అటవీశాఖ,వివిధ శాఖల అధికారులతో సమీక్ష**

**-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**

హంసకలం వార్త

వర్షాలు కురిసిన తరువాతే మొక్కలు నాటేందుకు సిద్ధంగా పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు.వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో వివిధ శాఖల ఆద్వర్యంలో మొక్కలు నాటే లక్ష్యంపై జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ,పలు శాఖలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.వివిధ పథకాల కింద గతంలో నాటిన మొక్కలు ఎండిపోయిన ,పెరగకపోయిన వాటిని అటవీశాఖ అధికారులు పరిశీలి ంచాలని సూచించారు.వర్షాలు కురిసిన తరువాతే ఏర్పాట్లు చేసి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు.నీటి పారుదల



శాఖ స్థలాలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,అటవీ ప్రాంతాలు,మున్సిపల్ డంపింగ్ యార్డులు,ఫారెస్ట్ అర్బన్ పార్క్,ఎక్సైజ్ శాఖ,నూతన రహదారుల వెంట మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచాలని సూచించారు.జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు,మున్సిపాలిటీల్లో నర్సరీలు ఉండాలని స్పష్టం చేశారు.వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన మొక్కల లక్ష్యం మొత్తం 8,65,200 గా లక్ష్యాన్ని నిర్ణయించామని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ వెల్లడించారు. సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం,జిల్లా విద్యాధికారి మొండయ్య,జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్,జిల్లా పంచాయతీ అధికారి జయశీల,జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు,మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్,అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# మైనర్ బాలికపై లైంగిక దాడి కేసు..నలుగురు అరెస్ట్

**-మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు**

హంసకలం వార్త

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు.మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం..ప్రధాన నిందితుడు మారి రామకృష్ణ ప్రేమ పేరుతో బాలికను నమ్మించాడు. అనంతరం జూలై 3న జాలే నవీన్,గణేష్ సహకారంతో ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఆ తర్వాత జూలై 4న విజేందర్,జూలై 5న మహేష్ కూడా బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.జూలై 11న బాధిత బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి



దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## ఎన్యుమరేషన్ ఫామ్ ల ఆన్ లైన్ వెంటనే పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



హంసకలం వార్త

ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ఫాం ల డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం సాయంత్రం భైంసా పట్టణంలో ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. పంపిణీ చేసిన ఎస్ఐఆర్ ఫాంలు, పూర్తి చేసిన ఆన్ లైన్ ప్రక్రియ,తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియను మొత్తం పూర్తి పారదర్శకంగా పూర్తిచేయాలని ఆదేశించారు.అనంతరం నిర్మల్ పట్టణంలోని 24 వ వార్డులో ఎస్ఐఆర్ తీరును పరిశీలించారు. ఆన్ లైన్ ప్రక్రియకు సంబంధించిన పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. బిఎల్ఓ యాప్ ను పరిశీలించారు.స్థానిక ఓటర్లతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ఫారములు పూరించి,వెంటనే ఫారములు బిఎల్ఓ లకు అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, తహసిల్దార్లు శశిభూషణ్,రాజు, ఎంపీడీవో నీరజ్, స్థానిక ప్రజాప్రతి నిధులు,ఇతర అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై త్వరలో శుభవార్త...!

**-సీఎం రేవంత్ రెడ్డి**

**-అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ ప్రారంభం**



హంసకలం వార్త

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి త్వరలో శుభవార్త వినబోతున్నారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు.ఈ ప్రాజెక్టు కింద 90 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను ఒప్పించి అవసరమైన అనుమతులు సాధించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపులపై కూడా సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు.బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ (సీక్యూపీ) తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించి పరిశీలించారు.అనంతరం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు.కృష్ణా పరివాహక ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న దిండి,పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్,ఆర్డీఎస్ ప్రాజెక్టుల సమస్యల పరిష్కారానికి పొరుగు రాష్ట్రంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.అన్ని అనుమతులు సాధించి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు.పాలమూరు జిల్లాను విద్య, నీటిపారుదల, పారిశ్రామిక అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు ట్రిపుల్ ఐటీ, ఇంజినీరింగ్ కళాశాలలు,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రతి నియోజకవర్గానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు) ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.పెట్టుబడులను ఆకర్షించేందుకు తెలంగాణ రైజింగ్-2047 విజన్ కింద పలు రంగాలకు కొత్త విధానాలు తీసుకొచ్చామని,టూరిజం,ఎనర్జీ,మెడికల్,స్పోర్ట్స్ పాలసీలతో రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనుకూల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. అమర రాజా సంస్థ తెలంగాణ రైజింగ్ విజన్‌కు భాగస్వామిగా నిలవాలని కోరారు.పాలమూరులో పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని గుర్తుంచుకొని స్థానిక యువతకు అత్యధిక ఉపాధి అవకాశాలు కల్పించాలని పరిశ్రమలకు సూచించారు.వాతావరణ మార్పులు,కాలుష్య నియంత్రణ దృష్ట్యా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని,ఈవీ బ్యాటరీల తయారీలో అమర రాజా సంస్థ ముందంజలో ఉండడం అభినందనీయమన్నారు. సంస్థలో 700 మంది ఉద్యోగుల్లో 400 మంది మహిళలు ఉండటం గర్వకారణమని చెప్పారు.అమర రాజా సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో చైనా,జపాన్,జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాల కంపెనీలతో పోటీ పడుతోందని, దేశంలోనే అగ్రశ్రేణి ఈవీ బ్యాటరీ తయారీ సంస్థగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి ప్రశంసించారు.ఈ సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి,అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్,ఎంపీ డీకే అరుణ, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు,ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులుగా డాక్టర్ ఎం అశోక్ కుమార్ బాధ్యతల స్వీకరణ

హంసకలం వార్త



మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న డాక్టర్ ఎం అశోక్ కుమార్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఇంచార్జ్ పర్యవేక్షకులుగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# బిజినెస్

## 30 దాటిందా? అయినా సంపద సృష్టించొచ్చు.. నిపుణుల సూపర్ టిప్స్!



చిన్న వయసులోనే పెట్టుబడులు మొదలుపెట్టాలని ఆర్థిక నిపుణులు తరచూ సూచిస్తుంటారు. దీంతో 30 లేదా 40 ఏళ్ల వయసులో పెట్టుబడులు ప్రారంభించే చాలామందికి ఆలస్యమైందనే భావన కలుగుతుంది. అయితే మాజీ వాల్‌స్ట్రీట్ ట్రేడర్, ఆర్థిక నిపుణురాలు వివియన్ టూ మాత్రం అలాంటి ఆందోళన అవసరం లేదని చెబుతున్నారు. సరైన ప్రణాళికతో ముందుకెళితే ఈ వయసులో కూడా ఆర్థిక లక్ష్యాలను చేరుకోవచ్చని ఆమె సూచించారు.

**-జీతం పెంచమని అడగాలి**

30, 40 ఏళ్ల వయసులో చాలా మంది తమ ఆదాయం పెరిగే దశలో ఉంటారని వివియన్ టూ చెప్పారు. అలాంటి సమయంలో యాజమాన్యాన్ని జీతం పెంచండని అడగడానికి భయపడొద్దని సూచించారు. ప్రతి ఏడాది కనీసం 15 శాతం వేతన పెంపు కోరాలని చెప్పారు. చిన్న వయసులో పెట్టుబడులు ప్రారంభించకపోయినా, ఈ దశలో ఆదాయాన్ని వేగంగా పెంచుకోవడం ద్వారా ఆ లోటును భర్తీ చేసే అవకాశం ఉంటుందని వివరించారు.

**-పొదుపే ప్రధాన ఆయుధం**

ఖర్చులపై కచ్చితమైన నియంత్రణ అవసరమని వివియన్ టూ పేర్కొన్నారు. సాధారణంగా ఆదాయంలో 50 శాతం అవసరాలకు, 30 శాతం వ్యక్తిగత కోరికలకు, 20 శాతం పొదుపునకు కేటాయించాలని సూచిస్తారు. అయితే ఆలస్యంగా పెట్టుబడులు ప్రారంభించిన వారు పొదుపు, పెట్టుబడుల వాటాను 40 శాతానికి పెంచాలని ఆమె సూచించారు. ఇందుకోసం అవసరం లేని ఖర్చులను తగ్గించుకోవాలని చెప్పారు.

## పతంజలి ఫుడ్స్ షేర్లు 20 శాతం పతనం-ఆరేళ్ల కనిష్టానికి చేరిన స్టాక్




పతంజలి ఫుడ్స్ షేర్లు బుధవారం ఒక్కసారిగా 20 శాతం వరకు పతనమై పెట్టుబడిదారులకు భారీ షాక్ ఇచ్చాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో షేరు ధర రూ.328.20కు పడిపోయి, 2020 ఏప్రిల్ తర్వాత కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. అనంతరం కొంత కోలుకున్నప్పటికీ, మధ్యాహ్న ట్రేడింగ్‌లో కూడా సుమారు 16 శాతం నష్టంతో రూ.345 వద్ద కొనసాగింది. ఈ ఆకస్మిక పతనంపై స్పందించిన కంపెనీ, షేర్ ధర ఇంతగా పడిపోవడానికి కారణమయ్యే ఎలాంటి కీలక పరిణామాలు లేదా ప్రకటించాల్సిన సమాచారం తమ వద్ద లేదని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు స్పష్టం చేసింది. కంపెనీ సాధారణంగా తన వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తోందని, లక్ష్యాలను చేరుకునే దిశగా ముందుకు సాగుతోందని పేర్కొంది. సెబీ లిస్టింగ్ నిబంధనల ప్రకారం బహిర్గతం చేయాల్సిన ఎలాంటి ముఖ్యమైన సమాచారం ప్రస్తుతం లేదని యాజమాన్యం తెలిపి ంది. గత కొంతకాలంగా పతంజలి ఫుడ్స్ షేర్లపై అమ్మకాల ఒత్తిడి కొనసాగుతోంది. గత నెలలో షేరు దాదాపు 19 శాతం క్షీణించగా, ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు సుమారు 38 శాతం విలువ కోల్పో యింది. బీఎస్ఈ గణాంకాల ప్రకారం గత వారం 16 శాతం, రెండు వారాల్లో 16.7 శాతం, మూడు నెలల్లో 26 శాతం, ఆరు నెలల్లో 36.6 శాతం వరకు ఈ షేరు పడిపోయింది. గతంలో రుచి సోయా ఇండస్ట్రీస్ పేరుతో ఉన్న ఈ సంస్థ ప్రస్తుతం దేశంలోని ప్రముఖ ఎడిబుల్ ఆయిల్, ఎఫ్ఎంసీజీ కంపెనీల్లో ఒకటిగా ఉంది. వంట నూనెలతో పాటు ఆహార ఉత్పత్తులు, గృహ వినియోగ వస్తువులు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల తయారీలో సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

## వేలకోట్ల రూపాయల కంపెనీకి ఓనం-అయినా హోమ్ లోన్ ఇవ్వని బ్యాంకు!




ప్రముఖ స్టాక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ 'ధన్' మాతృసంస్థ 'రెయిజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్' వ్యవస్థాపకుడు, సీఈఓ ప్రవీణ్ జాదవ్‌కు ఒక ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ నుంచి ఊహించని పరిణామం ఎదురైంది. ఆయన దరఖాస్తు చేసుకున్న గృహ రుణాన్ని (హోమ్ లోన్) సదరు బ్యాంక్ తిరస్కరించింది. ఒక కంపెనీకి వ్యవస్థాపకుడిగా (ఫౌండర్) ఉండటం అధిక రిస్క్‌తో కూడుకున్న విషయమని పేర్కొంటూ బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. సుమారు 1.2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.11,000 కోట్లు) విలువైన సంస్థకు అధిపతిగా ఉన్న తనకే ఇటువంటి అనుభవం ఎదురవడంపై జాదవ్ విస్మయం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. "వ్యవస్థాపకుల జీవితం చాలా కష్టతరమైనది. కేవలం నేను ఫౌండర్‌ననే కారణంతో ఓ అగ్రశ్రేణి ప్రైవేట్ బ్యాంక్ నా గృహ రుణ దరఖాస్తును తిరస్కరించింది" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తాను గత 25 ఏళ్లుగా అదే బ్యాంకులో ఖాతాదారుడినని, తన సిబిల్ స్కోర్ 800 కంటే ఎక్కువగా ఉందని, ఆ బ్యాంక్ పరిధిలోని టాప్ కస్టమర్లలో తానూ ఒకడినని ఆయన గుర్తుచేశారు. గతంలో ఇదే బ్యాంక్ తనను ఒక ప్రముఖ ఫిన్‌టెక్ ఆవిష్కర్తగా సత్కరించిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. బహుశా సొంత ఇల్లు లేకపోతే, ఇక తన జీవితాంతం కార్యాలయంలోనే గడపాల్సి వస్తుందేమోనని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. ప్రవీణ్ జాదవ్ 2021లో 'రెయిజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్'ను స్థాపించారు. ఈ సంస్థ 2025లో సుమారు 120 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించి, 1.2 బిలియన్ డాలర్ల విలువతో 'యూనికార్న్' హోదాను సొంతం చేసుకుంది.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్: ప్రపంచ నం.1కు అడుగు దూరంలో గిల్

ఇంటర్నెట్ డెస్క్:

వన్డే ర్యాంకింగ్స్ జాబితాను ఐసీసీ తాజాగా విడుదల చేసింది. ఇంగ్లండ్‌పై తొలి వన్డేలో 80 పరుగులు చేసిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ ర్యాంకింగ్స్‌లో భారీ లాభం పొందాడు. 12 రేటింగ్ పాయింట్లు పెంచుకుని గిల్(803) ఈ జాబితాలో రెండో స్థానానికి ఎగబాకాడు. ప్రపంచ నంబర్ 1 స్థానానికి అడుగు దూరంలో నిలిచాడు. ప్రస్తుతం ఈ జాబితాలో న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ డారిల్ మిచెల్(814) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతడి కంటే గిల్ కేవలం 11 పాయింట్ల తేడాతో మాత్రమే వెనుకబడి ఉన్నాడు. టీమిండియా స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మూడు, నాలుగో స్థానాల్లో కొనసాగుతున్నారు.బుమ్రా ర్యాంక్ మెరుగుదల దాదాపు 968 రోజుల తర్వాత వన్డేల్లోకి తిరిగొచ్చిన భారత పేస్‌గుర్రం జస్ప్రీత్ బుమ్రా తొలి మ్యాచ్‌లోనే ప్రభావం చూపించాడు. ఇంగ్లండ్‌పై 1/31 గణాంకాలు నమోదు చేసిన బుమ్రా.. ఐసీసీ వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 24వ స్థానానికి చేరుకున్నాడు. తొలి వన్డేలో నాలుగు వికెట్లు తీసి, అజేయ అర్ధ శతకంతో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన అక్షర్ పటేల్‌కు కూడా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారీ లాభం చేకూరింది. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అతడు ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 73వ స్థానానికి చేరుకున్నాడు. బౌలింగ్‌లో రెండు స్థానాలు మెరుగుపరుచుకుని 42వ స్థానంలో నిలిచాడు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో టాప్-10లోకి ప్రవేశించి 9వ ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. అజేయ అర్ధ శతకం సాధించిన వాషింగ్టన్ సుందర్ కూడా బ్యాటింగ్‌లో 24 స్థానాలు ఎగబాకి 177వ స్థానానికి చేరుకోగా.. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో 16 స్థానాలు మెరుగుపరుచుకుని 55వ ర్యాంక్‌లో నిలిచాడు. టీ20 ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ ఆటగాళ్ల జోరు భారత్‌తో టీ20 సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన ఇంగ్లండ్ ప్లేయర్లు టీ20 ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్లారు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ 12 స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంక్‌కు చేరుకోగా.. జోస్ బట్లర్ ఆరో స్థానానికి చేరుకున్నాడు. పేసర్ జోఫ్రా ఆర్చర్ ఎనిమిది స్థానాలు మెరుగుపరుచుకుని సంయుక్తంగా 18వ ర్యాంక్‌ను దక్కించుకున్నాడు.




## అర్జెంటీనాను తొలగించాలని.. 75 లక్షల మంది సంతకాలతో పిటిషన్!

ఇంటర్నెట్ డెస్క్:

ఫిఫా ప్రపంచ కప్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా మరికొద్ది గంటల్లో సెమీ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌ను ముందు మెస్సి సేన ఓ వివాదంలో పడింది. ఆ జట్టుకు రిఫరీల నుంచి అనుకూల నిర్ణయాలు వస్తున్నా యంటూ ఆరోపిస్తూ సోషల్ మీడియాలో ఓ ఉద్యమం మొదలైంది. ఫిఫా ప్రపంచ కప్ నుంచి అర్జెంటీనాను తప్పించాలని కోరుతూ 75 లక్షల మందికి పైగా సంతకాలు చేసి పిటిషన్ వేశారు. ఈ వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశం అయింది'ఫిఫా, రిఫరీలు. లియోనెల్ మెస్సి, అర్జెంటీనా జట్టుకు అనుకూలంగా వ్యవహరిస్తు న్నారనేది స్పష్టంగా కనిపిస్తోంది. విజేతను ముందు గానే నిర్ణయిస్తే మిగతా జట్లు ఎందుకు పోటీ పడాలి? అర్జెంటీనాను ప్రపంచ కప్ నుంచి తప్పించి అందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. అర్జెంటీనాపై రిఫరీల పక్షపాతం ఉందంటూ వచ్చిన ఆరోపణలతో ఈ ప్రచారం ఊపందుకుంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఫిఫా నుంచి ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు. మరోసారి తెరపైకి అర్జెంటీనా-ఇంగ్లండ్ వైరం ప్రపంచ ఫుట్‌బాల్‌లో చిరకాల ప్రత్యర్థులుగా పేరున్న అర్జెంటీనా, ఇంగ్లండ్ జట్లు సెమీ ఫైనల్‌లో తలపడనున్నాయి. ఈ రెండు జట్ల మధ్య పోరు ఎప్పుడూ ఆసక్తిగానే ఉంటుంది. దక్షిణ అట్లాంటిక్‌లోని ఫాక్‌ల్యాండ్ దీవుల (అర్జెంటీనా భాషలో మాల్వినాస్) వివాదం కారణంగా ఈ రెండు దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం ఫుట్‌బాల్‌లోనూ కనిపిస్తూనే ఉంది. 1986 మెక్సికో ప్రపంచ కప్‌లో డిగో మారడోనా 'హ్యాండ్ ఆఫ్ గాడ్' గోల్‌తో అర్జెంటీనా 2-1 తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించిన ఘటన ఇప్పటికీ ఈ రెండు జట్ల పోరులో ప్రత్యేక గుర్తుగా నిలిచింది.




# స్పోర్ట్స్

## జపాన్ ఓపెన్ టోర్నీ: భారత్‌కు షాక్ లక్ష్య సేన్, ఆయుశ్ శెట్టి ఔట్




ఇంటర్నెట్ డెస్క్:

జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాళ్లకు నిరాశ తప్పలేదు. ప్రతిష్ఠాత్మక టోర్నీ తొలి రౌండ్‌లోనే స్టార్ షట్లర్లు లక్ష్య సేన్, ఆయుశ్ శెట్టి ఓటమి చవి చూసి టోర్నీ నుంచి నిష్క్రమించారు. వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ముందు కీలక సన్నాహక టోర్నీగా భావిస్తున్న ఈ పోటీలో భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగలడం గమనార్హం. ఇప్పటికే పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ గాయంతో మ్యాచ్ మధ్యలోనే తప్పుకుంది. సాత్విక్ భుజం గాయంతో బాధపడటంతో తొలి రౌండ్ మ్యాచ్‌ను కొనసాగిం చలేకపోయారు. ఆ తర్వాత సింగిల్స్‌లోనూ భారత అగ్రశ్రేణి ఆటగాళ్లు ఓటమి చవి చూడటం ఆందోళన కలిగిస్తోందిజపాన్‌కు చెందిన కోకి వతనాబే చేతిలో లక్ష్య సేన్ వరుస గేముల్లో ఓడిపోయాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 14వ స్థానంలో ఉన్న లక్ష్యకు.. 17వ ర్యాంకర్ వతనాబే ఏ మాత్రం గెలిచే అవకాశం ఇవ్వలేదు. ఆరంభ గేమ్‌లో కొంతవరకు పోటీ ఇచ్చిన లక్ష్య.. కీలక దశలో వెనుకబడ్డాడు. రెండో గేమ్‌లో వతనాబే మరింత దూకుడుగా ఆడాడు. శక్తివంతమైన స్మాష్‌లతో లక్ష్యను ఒత్తిడిలోకి నెట్టాడు. కేవలం 38 నిమిషాల్లోనే 21-16, 21-14 తేడాతో విజయాన్ని అందుకున్నాడు. ఈ సీజన్‌లో లక్ష్య సేన్ నిలకడ కోసం పోరాడుతున్నాడు. మార్చిలో ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ ఫైనల్‌కు చేరిన అతడు.. మేలో సింగపూర్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ వరకు వెళ్లాడు. అనంతరం ఇండోనేషియా ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించిన సంగతి తెలిసిందే.



## సల్మాన్ కు కుట్రలు, కుతంత్రాలు తెలియవు: పూజా హెగ్డే

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌పై అందాల భామ పూజా హెగ్డే ప్రశంసలు కురిపించింది. సల్మాన్ చాలా మంచివాడని, అతనికి కుట్రలు, కుతంత్రాలు తెలియవని ప్రశంసించింది. కొంతమంది హీరోలు మాత్రం కుట్రలు పన్నుతుంటారని సంచలన వ్యాఖ్యలు చేసింది చేసింది. కానీ, సల్మాన్ మాత్రం గొప్ప వ్యక్తి అంటూ కొనియాడింది. మనసులో ఏది ఉంటే అది బయటకు చెబుతారని... అలా బయటకు చెప్పడం చాలా కష్టమని వెల్లడించింది.'అరబిక్ కుతు', 'మోనికా' పాటలు తన ఫేవరెట్ అని తెలిపింది. డాన్స్ చేసేటప్పుడు మ్యూజిక్‌ను ఎంజాయ్ చేయడాన్ని హృతిక్ రోషన్ నుంచి నేర్చుకున్నట్లు వివరించింది. ప్రభాస్ అంటే ఫుడ్ గుర్తుకు వస్తుందని చెప్పింది. సినిమాల విషయానికి వస్తే టాలీవుడ్‌లో పూజకు అవకాశాలు బాగా తగ్గిపోయాయి. ప్రస్తుతం ఆమె బాలీవుడ్, కోలీవుడ్‌పై పూర్తిగా ఫోకస్ చేస్తోంది. తమిళనాడు సీఎం విజయ్ చివరి చిత్రం 'జన నాయగన్'లో పూజ హీరోయిన్ గా నటించింది.

## నటి సమీరా రెడ్డి ఫన్నీ పోస్ట్ అసలు విషయం ఏంటో చూడండి!



తన కుమార్తె తనను కోర్టుకు తీసుకెళుతోందని ఓ తల్లిగా ప్రముఖ నటి సమీరా రెడ్డి చెప్పడం సోషల్ మీడియాలో అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే ఇది సీరియస్ విషయం కాదు, కేవలం ఓ సరదా సంఘటన మాత్రమే. ఈ ఊహించని పరిణామం గురించి సమీరా రెడ్డి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సరదా వీడియోను పంచుకున్నారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. బుధవారం నాడు సమీరా రెడ్డి పోస్ట్ చేసిన వీడియోలో ఆమె ఇలా మాట్లాడారు, "సాధారణంగా పిల్లలు తమ తల్లిదండ్రులను ఎక్కడికి తీసుకెళ్తారు? పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లకా? ప్రిన్సిపాల్ ఆఫీసుకా? స్కూల్ యాన్యువల్ డే ఫంక్షన్లకా? స్నేహితుల పుట్టినరోజు పార్టీలకైతే తప్పకుండా తీసుకెళతారు. కానీ నా కూతురు నైరా నన్ను ఎక్కడికి తీసుకెళుతోందో తెలుసా? కోర్టుకు! చూడటానికి ఇదొక్కటే మిగిలింది. ఏం జరుగుతుందో చూస్తూ ఉండండి" అని నవ్వుతూ చెప్పారు. "ఇంకా ఏం జరుగుతుందో నమ్మలేకపోతున్నాను" అని ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. సమీరా రెడ్డి, ఆమె భర్త అక్షయ్ వర్దేకు ఇద్దరు పిల్లలు. 2015లో కొడుకు హన్స్, 2019 జులై 12న కూతురు నైరా జన్మించారు. 2014లో వివాహం చేసుకున్న ఈ జంట, తమ కుటుంబానికి సంబంధించిన మధుర క్షణాలను సోషల్ మీడియాలో తరచుగా పంచుకుంటారు. సమీరా రెడ్డి తన మాతృత్వపు అనుభవాలను, ప్రసవానంతర డిప్రెషన్, బరువు సమస్యల వంటి సవాళ్లను ధైర్యంగా చర్చిస్తారు. తల్లులు తమను తాము అంగీకరించాలని, ఆత్మవిశ్వాసంతో ఉండాలని ఆమె ప్రోత్సహిస్తుంటారు. ఇక సినిమాల విషయానికొస్తే, సమీరా రెడ్డి ఏకంగా 13 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ నటనలోకి అడుగుపెడుతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న హారర్ థ్రిల్లర్ "చిమ్నీ" విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో ఆమె కాళీ అనే పాత్రలో కనిపించనున్నారు. ఓ దెయ్యం పట్టిన ప్యాలెస్‌లో తన కూతురిని కాపాడుకునేందుకు పోరాడే తల్లి కథ ఇది. గగన్ పూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, 'ఫీటస్ ఇన్ ఫెటు' అనే అరుదైన వైద్య పరిస్థితి ఆధారంగా తెరకెక్కుతుండటం విశేషం. ఈ సినిమాలో ప్రాచీ ఠాకూర్, శార్దూల్ రాణా, ఆదిత్య కుమార్ వంటి నటులు కూడా ఉన్నారు.

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన బండ్ల గణేశ్



ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ తన ఆస్తి వేలం వ్యవహారంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చర్యలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లారు. శ్రీ పరమేశ్వర పౌల్ట్రీ ఫామ్‌కు బ్యాంక్ అందించిన రుణాలకు గాను బండ్ల గణేశ్, ఆయన కుటుంబ సభ్యులు తమ ఆస్తులను పూచీకత్తుగా పెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో లోన్ తీర్చలేదంటూ... కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియలో బ్యాంక్ కింద ఆస్తిని వేలం వేయడంతో గణేశ్ డెబ్ట్స్ రికవరీ ట్రైబ్యునల్ ను ఆశ్రయించారు. ట్రైబ్యునల్ ఆయనకు అనుకూల తీర్పు ఇచ్చింది. వేలం ప్రక్రియను రద్దు చేసి ఆస్తిని తిరిగి అప్పగించాలని, కొనుగోలుదారుకు సొమ్ము వడ్డీతో సహా వాపసు చేయాలని ఆదేశించింది.

## 'చెన్నై లవ్ స్టోరీ'లో కిరణ్ అబ్బవరం పాత్ర ఇదే పుట్టినరోజున వెల్లడించిన చిత్రబృందం

యువ హీరో కిరణ్ అబ్బవరం పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఆయన అభిమానులకు 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రబృందం ప్రత్యేక కానుక అందించింది. ఈ సినిమాలో కిరణ్ అబ్బవరం పోషిస్తున్న పాత్రను అధికారికంగా పరిచయం చేసింది. ఇందులో ఆయన 'స్టీవెన్ శంకర్' పాత్రలో కనిపించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేస్తూ సినిమాపై మరింత ఆసక్తి పెంచింది. మాస్ మూవీ మేకర్స్ సంస్థ సోషల్ మీడియాలో ఈ ప్రకటన చేసింది. 'స్టీవెన్ శంకర్‌గా కిరణ్ అబ్బవరం గుర్తుండిపోయే నటనను కనబరుస్తారు. ప్రపంచవ్యాప్తంగా జులై 24న థియేటర్లలో కలుద్దాం' అంటూ శుభాకాంక్షలు తెలిపింది. ఈ చిత్రంలో కిరణ్‌కు జోడీగా శ్రీగౌరి ప్రియ నటిస్తోంది. ఆమె 'నివి' పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌లో స్టీవెన్ శంకర్, నివి మధ్య జరిగే సంభాషణ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. మొదటి ప్రేమ గురించిన నివి అభిప్రాయానికి స్టీవెన్ శంకర్ భిన్నమైన కోణంలో సమాధానం చెప్పే సన్నివేశం ఆసక్తిని పెంచింది. దర్శకుడు రవి నంబూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు స్క్రీన్‌ప్లే కూడా అందించారు. కథను సాయిరాజేశ్ అందించగా, ఆయనే నిర్మాతల్లో ఒకరిగా ఉన్నారు. ఎస్‌కేఎన్ మాస్ మూవీ మేకర్స్, అమృత ప్రొడక్షన్స్ సంస్థలపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించారు. విశ్వాస్ డేనియల్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించారు. అనంత శ్రీరామ్ పాటలు రాయగా, సంతోష్ నాయుడు ఎడిటర్‌గా పనిచేశారు. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది.






## విజయ్ అభిమానులకు గుడ్‌న్యూస్ జులై 23న 'జన నాయగన్' విడుదల

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలపై నెలలుగా కొనసాగుతున్న అనిశ్చితికి తెరపడింది. జులై 23న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మేరకు చిత్రబృందం రిలీజ్ పోస్టర్ ను సోషల్ మీడియాలో పంచుకుంది. తమిళనాడులో ఈ సినిమాకు ప్రత్యేకంగా ఉదయం 5 గంటల షోలు ఉండవని తెలుస్తోంది. తొలి ప్రదర్శన ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నట్లు సమాచారం. కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మాత్రం ఉదయం 5 గంటల నుంచే షోలు వేయనున్నట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇటీవలే ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) 'ఏ' సర్టిఫికెట్ మంజూరు చేసింది. జులై 9న సర్టిఫికేషన్ పూర్తికాగా, సినిమా నిడివి 3 గంటల 3 నిమిషాల 11 సెకన్లుగా నమోదైంది. విడుదలకు ముందు చిత్రంలో 12 మార్పులు చేయాలని సెన్సార్ బోర్డు సూచించగా, ఆ మార్పులు చేశాకే సర్టిఫికెట్ ఇచ్చినట్టు తెలిసింది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించింది. విజయ్‌తో పాటు పూజా హెగ్డే, బాబీ డియోల్, మమితా బైజు కీలక పాత్రలు పోషించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ నటుడిగా కనిపించనున్న చివరి చిత్రం కావడంతో 'జన నాయగన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449